


'సోమశిల'లో పెరుగుతున్న నీటిమట్టం



అనంతసాగరం : ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో సోమశిల జలాశయంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. మంగళవారం 17,623 క్యూసెక్కుల వరద వస్తుండగా, 47.618 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 8000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇసుక రెడీ!

డీసిల్టేషన్ ప్రక్రియలో మొదలైన తవ్వకాలు • మూడు పాయింట్లలో 7,500 టన్నుల వెలికితీత • ఒకట్రెండు రోజుల్లో విక్రయాల ప్రారంభం

వరదల నేపథ్యంలో బోట్ల రాక ఆలస్యం • 'ఉచిత ఇసుక'ను చెడగొట్టేందుకు అక్రమార్కుల పన్నాగం • వారి కుట్రలకు అధికారుల బ్రేక్

ఉచిత ఇసుక పాలసీ అమలుకు సమయం ఆసన్నమైంది. ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరతను తీర్చేందుకు ప్రభుత్వం డీసిల్టేషన్ పాయింట్లను ప్రతిపాదించింది. సంగం బ్యారేజీ వద్ద సంగం, సూరాయపాలెం, నెల్లూరు బ్యారేజీ వద్ద పోతిరెడ్డిపాలెంల వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. ఈ మూడు చోట్ల ఇప్పటికే సుమారు 7,500 మెట్రిక్ టన్నుల ఇసుకను వెలికితీశారు. తొలుత సంగం పాయింట్‌లోనే దాదాపు 6,400 టన్నుల ఇసుకను తీయగా, నెల్లూరు బ్యారేజీ వద్ద 500 టన్నులు, సూరాయపాలెం వద్ద మరో 600 టన్నులు తీశారు. ఆ ఇసుక మొత్తాన్ని యార్డులకు తరలించి, ఒకటి, రెండు రోజుల్లో ఇసుక విక్రయాలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



సంగం : డ్రెడ్జింగ్ విధానంలో పెన్నా నదిలో పడవల ద్వారా తీస్తున్న ఇసుక

నెల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి రావాల్సి ఉంది. అయితే విజయవాడ వరదల నేపథ్యంలో ఒకటి, రెండు రోజులు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఏ క్షణాన ప్రారంభించమన్నా అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేసుకున్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)లో ఇసుక ధరలు, రవాణా ధరలపై నిర్ణయం తీసుకున్నారు. టన్ను ఇసుకను రూ.380కు విక్రయించేలా నిర్ణయించారు. ఈ ధరను ఎప్పటికప్పుడు సమీక్షించి తగ్గించేలా కమిటీలో తీర్మానించారు. అలానే ప్రకటించిన రవాణా ధరలకు మించి ఎక్కువ వసూలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

• పడవల రాక ఆలస్యం

మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డుల్లో ఇసుక నిల్వలు తరిగిపోవడంతో జిల్లాలో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో వీలైనంత త్వరగా డీసిల్టేషన్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం వేగంగా కదిలింది. బోట్ల ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు ఆసక్తి కలిగిన బోట్స్‌మన్ సొసైటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. మొత్తం 15 సొసైటీలు ఆసక్తి చూపగా వాటన్నిటినీ ఎంపానెల్ చేశారు. ఈ సొసైటీలకు సంబంధించిన బోట్లన్నీ విజయవాడ, గుంటూరు జిల్లాల్లో ఉండటం, అక్కడ వరదలు రావడంతో జిల్లాకు బోట్ల రాక ఆలస్యమైంది. ప్రస్తుతం ఒక్కో పాయింట్‌లో ఒక్కో సొసైటీ మాత్రమే తవ్వకాలు చేస్తోంది. సూరాయపాలెం, పోతిరెడ్డిపాలెం పాయింట్ల వద్ద మంగళవారం డీసిల్టేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం రోజుకు సరాసరి 1500 టన్నులకుపైగా ఇసుకను వెలికి తీస్తున్నారు. ఇప్పుడిప్పుడే బోట్లు వస్తున్నాయి. పూర్తిస్థాయిలో డీసిల్టేషన్ మొదలైతే జిల్లాకు సరిపడా డిమాండ్‌ను అందుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

• రోజుకు 4వేల టన్నుల అవసరం

జిల్లా అవసరాలకు సరాసరి రోజుకు 4 వేల టన్నుల వరకు ఇసుక అవసరమవుతోంది. కాగా డీసిల్టేషన్ పాయింట్లకు దగ్గర్లో ఏర్పాటు చేసిన యార్డుల వద్ద విక్రయాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాలు అమర్చారు. కంప్యూటర్లు, ప్రింటింగ్ యంత్రాలను కూడా తీసుకొచ్చారు. యార్డుల వద్ద ఇన్‌చార్జ్‌లను కూడా నియమించారు. అలానే ఉచిత ఇసుక పాలసీ అమలుకు సంబంధించి మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు అధికారులను(మాస్టర్ ట్రైనర్స్) ఎంపిక చేసి, మంగళవారం విజయవాడలో శిక్షణ ఇచ్చారు.



పడవలో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

• మళ్లీ వారే..!

ఉచిత ఇసుక పాలసీ ప్రక్రియలోకి అక్రమార్కులు చొరబడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను కొల్లగొట్టిన వారే ఇప్పుడూ డీసిల్టేషన్ చేసేందుకు ముందుకొచ్చారు. 15 మంది ఎంపానెల్ జరగ్గా అందులో కొన్నింటి తెరవెనుక గత ప్రభుత్వంలో ఇసుక డాన్‌లుగా పేరొందిన వ్యక్తులు ఉన్నారని తెలుస్తోంది. వీరు వైసీపీ నాయకులతో జతకట్టి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. డీసిల్టేషన్ అంటే బోట్ల ద్వారా మాత్రమే ఇసుకను వెలికి తీయాల్సి ఉంటుంది. కానీ డ్రెడ్జింగ్ చేసి ఇసుకను కొల్లగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. బోట్లు కాకుండా డ్రెడ్జింగ్ యంత్రాలు తీసుకొచ్చిన బోట్స్‌మన్ సొసైటీలను జిల్లా అధికారులు వెనక్కు పంపారు. ఇది నిబంధనలకు విరుద్ధమైతే.. వైసీపీ నాయకులు మాత్రం ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోక నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నారు.



సంగంలో టైర్లబండి నుంచి ట్రక్కు ఆటోలోకి లోడ్ చేస్తున్న ఇసుక

టైర్ల బండ్ల ముసుగులో..

• ట్రాక్టర్, ట్రక్కు ఆట్లో ఇసుక అక్రమ రవాణా

• జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు

సంగం/బుచ్చిరెడ్డిపాళెం : ఇసుక అవసరాలు, ఇబ్బందులు పలువురిలో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. సంగం, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లోని పెన్నానదిలో నుంచి ఎడ్ల బండ్ల ద్వారా తీసుకువస్తున్న ఇసుకను ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోల్లో లోడుచేసుకుని మారుబేరాలతో విక్రయిస్తున్నారు. జిల్లాలో ఇసుక నిల్వలు తరిగిపోవడంతో డిమాండ్ బాగా పెరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త విధానంలో సంగం, సూరాయపాళెం, నెల్లూరు రూరల్ తదితర పెన్నా రీచ్‌ల్లో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుకను డంపింగ్ యార్డ్‌ల్లో నిల్వ చేస్తున్నా విక్రయాలు ప్రారంభం కాలేదు. నదిలో నుంచి ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న పెన్నా పరివాహక గ్రామాల్లో ఉన్న టైర్ల బండ్ల నిర్వాహకులు ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు.

• ట్రిప్పునకు రూ.వెయ్యి..

ఇసుక కొరతతో ఏర్పడిన డిమాండ్‌ను ఆసరా చేసుకుని సంగం మండలంలోని పెన్నా పరివాహక గ్రామాలైన దువ్వూరు, మక్తాపురం, అన్నారెడ్డిపాళెంలోని ఎడ్ల టైరుబండ్ల నిర్వాహకులు కలిసికట్టుగా నదిలో ఇసుకను తోడేస్తున్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు, మక్తాపురం, అన్నారెడ్డిపాళెంలోని పెన్నా నుంచి టైరుబండ్లతో ఇసుకను తెచ్చి బుచ్చి, సంగం సరిహద్దులు, దామరమడుగు, పాటూరు సరిహద్దుల్లో ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోల్లోకి మార్చి విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ. 2,500 నుంచి 3000వేలకు విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు ట్రిప్పునకు వెయ్యి రూపాయలు మిగులుతుండటంతో కొందరు ట్రాక్టర్ నిర్వాహకులు వ్యాపారంగా మార్చుకున్నారు. అత్యవసరమైతే ట్రక్ ఆటోలతో రెండు ఎడ్లబండ్ల ఇసుకను పగలే తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ తరహా ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

సంక్షేమ పథకాలకు రుణాలివ్వాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 10 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన క్లస్టర్లకు, పీఎంఈజీపీ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని ప్రైవేటు సెక్టార్ బ్యాంకులకు కూడా రుణాలు ఇవ్వాలని సూచించారు. నెలాఖరులోగా కౌలు రైతులకు లోన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఉద్యానవన, మత్స్య రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈ సమా వేశంలో ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్, ఆర్‌బీఐ ఏజీఎం హనుమకుమారి, నాబార్డు డీడీఎం బాబు, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

● రైతులు నష్టపోకుండా చర్యలు

రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తక్కువ కాకుం డా ధాన్యాన్ని విక్రయించుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఆనంద్ తెలి పారు. కలెక్టరేట్ శంకరన్ హాల్లో రైతులు, ధాన్యం ట్రేడర్లు, వ్యవసాయ, మార్కె టింగ్ శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. బయట రాష్ట్రాల వారు జిల్లాలో ధాన్యం కొనుగోలుచేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందచేస్తామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో స్థానికంగా ఉన్న ట్రేడర్లు కుమ్మక్కై ఇతర రాష్ట్రాల ట్రేడర్లను రానీయకుండా, ధర పతనానికి కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్‌ఐలకు స్టేషన్ల కేటాయింపు

నెల్లూరు(క్రైం): జిల్లాలో వీఆర్‌లో ఉన్న సివిల్ ఎస్‌ఐలతోపాటు, ఇటీవలే ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందిన వారికి అటాచ్‌మెంట్‌పై పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ కల్పిస్తూ మంగళవారం రాత్రి ఎస్పీ జీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎస్‌ఐ పేరు	అటాచ్‌మెంట్ ప్రాంతం
ఎస్ఎం బాషా	చిన్నబజారు పోలీసు స్టేషన్
ఆర్ సుధీర్‌కుమార్	నెల్లూరు రూరల్
కే శ్రీనివాసులురెడ్డి	ఆత్మకూరు
ఎస్‌కే గౌస్‌బాషా	కావలి-2
ఎస్‌కే ఖాదర్‌బాషా	కోవూరు
ఎం జానకి రామిరెడ్డి	కావలి-1
సీహెచ్ తిరుమలరెడ్డి	కావలి రూరల్
ఎస్‌కే దాదా బాషా	సౌత్‌ట్రాఫిక్
వీ బ్రహ్మయ్య	దర్గామిట్ట
ఎన్ శ్రీనివాససింగ్	డీసీఆర్‌బీ, నెల్లూరు
ఎస్‌కే ముక్తియార్	ఎస్‌హెచ్ స్క్వాడ్
పీ శ్రీనివాసులు	సీసీఎస్, నెల్లూరు
ఎస్‌కే సుల్తాన్‌బాష	సంతపేట
ఏ శ్రీనయ్య	ఉదయగిరి
ఓ శ్రీనివాసులు	డీటీసీ, నెల్లూరు
ఎస్ నాగరాజు	బాలాజీనగర్
ఎన్ శ్రీనివాసరావు	ఎస్‌డీపీవో, కావలి
యూ నాగయ	డీటీసీ, నెల్లూరు
కే శివయ్య	నవాబుపేట
ఎన్‌వీ శేషుబాబు	డీసీఆర్‌బీ, నెల్లూరు

బడుల్లో ఉపాధ్యాయుల

'సర్దుబాటు'

• మండల, డివిజన్ స్థాయిలో 545 మంది నియామకం

• జిల్లాలో 237 పోస్టుల మిగులు • జిల్లాస్థాయి సర్దుబాటుకు ఏర్పాట్లు

గత వైసీపీ సర్కారు అమలు చేసిన విధానాలు పాఠశాల విద్యపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జీవోనెం.117 కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతోపాటు ఉపాధ్యాయ పోస్టులు భారీగా మిగులుగా తేలాయి. దీంతో కుటమి ప్రభుత్వం చేస్తున్న సర్దుబాటు చర్యలు కొలిక్కి రావడం లేదు. మండల, డివిజన్ స్థాయిల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి ఎస్‌ఏ, ఎస్‌జీటీ పోస్టులను సర్దుబాటు చేశారు. ప్రస్తుతం మిగులు పోస్టులను త్వరలో జిల్లాస్థాయి కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు (విద్య): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. టీచర్ల సంఘాల అభ్యంతరాల మేరకు కొత్త మార్గ దర్శకాలు విడుదల కావడం, మండల స్థాయిల్లోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంతో ప్రక్రియ ఆలస్యంగా నడుస్తోంది. మండలాల స్థాయిలో ఉపాధ్యాయుల వివరాల జాబితా ఆధారంగా తొలుత సర్దుబాటు చేపట్టారు. పీఎస్ హెచ్ఎంలు 3, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సైన్స్ 49, ఆంగ్లము 15, తెలుగు 44, హిందీ 162, లెక్కలు 27, ఫిజికల్ సైన్స్ 65, సోషియల్ 60 మంది, ఎస్‌జీటీలు 357 మంది మొత్తం 782 మంది మిగులు టీచర్లుగా లెక్క తేల్చారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో బయాలాజికల్ సైన్స్ 45, ఆంగ్లము 52, తెలుగు 29, హిందీ 46, లెక్కలు 71, ఫిజికల్ సైన్స్ 64, సోషియల్ 79, ఎస్‌జీటీలు 159 మంది మొత్తం 545 మంది టీచర్లను 358 పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. మిగిలిన 232 మంది సర్‌ప్లస్ టీచర్లను జిల్లాస్థాయిలో జరిగే సర్దుబాటులో పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు.

• ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

సర్దుబాటు ప్రక్రియ జిల్లాలో గందరగోళంగా మారిందని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నాయి. అనేకమంది ఉపాధ్యాయులను నాలుగు మండలాలు దాటి సర్దుబాటు చేశారని, విద్యాసంవత్సరం మధ్యలో ఈ ప్రక్రియ చేపట్టడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనారోగ్య పరిస్థితులు, వృద్ధ తల్లిదండ్రులు కలిగిన వారు, చిన్న పిల్లలు ఉన్నవారు ప్రయాణ సౌకర్యంలేని మారుమూల ప్రాంతాలకు ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఈ అంశాలపై ఇప్పటికే డీఈవోకు సంఘాల నేతలు విజ్ఞప్తులు అందజేశారు. అసంబద్ధ సర్దుబాట్లు సరిచేసి, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



డీఎంహెచ్‌వో పెంచలయ్యకు వినతిపత్రం ఇస్తున్న వైద్యుల సంఘం నేతలు

నేటి నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

• జీవో నెం.85 రద్దు చేయాలని డిమాండ్ • సమ్మె నోటీసు అందజేత

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 10 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తూ దశలవారీగా నిరసన వ్యక్తం చేయనుంది. ఈ మేరకు డీఎంహెచ్‌వో పెంచలయ్యకు నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో గతంలో 30 శాతం మార్కులు వేసే విధానం ఉండేదని, జీఓ నెం.85తో 15 శాతానికి పరిమితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ జీవోను రద్దు చేసి గతంలో లాగానే పీజీ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ సివిల్ సర్జన్‌లుగా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం బుధ, గురువారాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చర్చలకు పిలవకపోతే 13, 14 తేదీలలో అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన సేవలన్నీ నిలిపి వేస్తామని పేర్కొన్నారు. 15వ తేదీన చలో విజయవాడ చేపడతామని, 16న నిరవధిక సమ్మె ప్రారంభమవుతుందని వెల్లడించారు. అసోసియేషన్ నేతలు రవీంద్రనాధ్‌రెడ్డి, ధర్మేంద్ర, ఆనంద్‌బాబు, బాలచంద్రబాబు, శాంతి, రమాకుమారి, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన మేయర్ భర్త

• 14 రోజులపాటు రిమాండ్ • కస్టడీ పిటిషన్ వేయనున్న పోలీసులు

• డీఎస్పీ ఎదుట లొంగిపోయిన మరో ఇద్దరు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 10 : నెల్లూరు నగర పాలక సంస్థలో కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో ప్రధాన నిందితుడు మేయర్ పొట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్ మంగళవారం నెల్లూరు 5వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయారు. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించడంతో జయవర్ధన్‌ను పోలీసులు కేంద్ర కారాగారానికి తరలించారు. కార్పొరేషన్ పూర్వ కమిషనర్లు హరిత, వికాస్‌మర్మత్‌ల సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూలైలో నాటి కమిషనర్ వికాస్ మర్మత్ ఫిర్యాదు మేరకు టీపీవోలు ప్రవీణ్‌కుమార్, దేవేంద్ర, వార్డ్‌ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు నాగేంద్రబాబు, కార్తీక్ మాలవ్య, స్ట్రక్చరల్ ఇంజనీర్ అండ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ దిలీప్‌కుమార్, మేయర్ భర్త పి జయవర్ధన్, ఆయన వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణలపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇప్పటివరకు టీపీవోలు, జయవర్ధన్ వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణలను అరెస్ట్ చేశారు. ఇక జయవర్ధన్ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పలు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, జయవర్ధన్ మాత్రం పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుంటూనే బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరులోని కోర్టులో లొంగిపోయారు. కాగా, పోలీసులు జయవర్ధన్‌ను త్వరలో కోర్టులో కస్టడీ పిటిషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న నాగేంద్రబాబు, కార్తీక్ మాలవ్యలు నగర డీఎస్పీ వద్ద లొంగిపోయారు. దిలీప్‌కుమార్ మాత్రం పరారీలో ఉన్నారు.



మేము సైతం!

• వరద బాధితులకు విరివిగా విరాళాలు

నెల్లూరు (హరనాథపురం) : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు 'మేము సైతం' అంటూ దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. నగరంలోని బాలాజీ ఏజెన్సీస్ (మహీంద్ర కార్ల షోరూం) నిర్వాహకులు రూ.3 లక్షల చెక్కును మంగళవారం కలెక్టర్ ఆనంద్‌కు అందచేశారు. ఈ సందర్భంగా ఈ షోరూం మేనేజింగ్ పార్టనర్ ఏ.నరేంద్రనాథ్ మాట్లాడుతూ తమ సంస్థ ఉద్యోగులు, కార్మికులు తమ ఒక్కరోజు జీతాన్ని వరద బాధితులకు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ ముని వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో దుప్పట్లు, చీరలు సిద్ధం చేసి విజయవాడకు పంపుతున్నారు.

● 32 టన్నుల కూరగాయలు

నెల్లూరు (వ్యవసాయం) : నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వ్యాపారులు దాదాపు రూ.10 లక్షల విలువజేసే 32 టన్నుల అన్ని రకాల కూరగాయలను సేకరించారు. మూడు లారీల్లో మంగళవారం మార్కెట్ నుంచి పంపించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లారీలకు జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులకు వారి చేతనైన సాయం అందజేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి, నెల్లూరు ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు, మార్కెట్ వ్యాపారుల సంఘం నాయకులు తాతిరెడ్డి, గయాజుద్దీన్, మధురెడ్డి, ప్రదీప్, ఏఎంసీల కార్యదర్శులు, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు రూ.3 లక్షల చెక్కు ఇస్తున్న నరేంద్రనాథ్



కాయగూరల లారీలకు పచ్చ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి



కావలిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి చెక్కు ఇస్తున్న వీరరాఘవ ఫర్టిలైజర్స్ యజమానులు

● నెల్లూరు రూరల్ : నగరంలోని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌ను కలిసి రూ.3.5 లక్షల విలువ చేసే చెక్కులను అందజేసి, సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపాలని కోరారు. ఇందులో 20వ డివిజన్‌కు చెందిన పమిడి శ్రీనివాసులు, నెల్లూరులోని హోటల్స్ అసోసియేషన్, రూరల్లోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్లు ఈ మొత్తాన్ని అందజేసినట్లు తెలిపారు.

● కావలి : వరద బాధితుల సహాయార్థంలో భాగంగా కావలి రెడ్‌క్రాస్ చీర, జాకెట్, లుంగీ, టవల్, దుప్పటితో కూడిన కిట్లను సిద్ధం చేస్తోంది. 200 కిట్ల కోసం వీర రాఘవ ఫర్టిలైజర్స్ అధినేత బచ్చు వీరాస్వామి రూ. 1 లక్షను రెడ్‌క్రాస్‌కు విరాళంగా అందచే శారు. అలాగే రెడ్‌క్రాస్ నిత్య యోగా సాధన సభ్యురాలు నల్లూ రు పద్మ రూ.10 వేలు, సోమిశెట్టి సుజన రూ.2 వేలు, గోరంట్ల శ్రీనివాసులు రూ.వెయ్యి అందచేశారు. రెడ్‌క్రాస్ బాధ్యులు 10 వేలు వంతున విరాళాలు ప్రకటించారు. అలాగే, ముఖ్యమంత్రి సహాయనిధికి వీరరాఘవ ఫర్టిలైజర్స్‌కు చెందిన బొచ్చు వీరాస్వామి, ఏడుకొండలు తన కుటుంబ సభ్యుల తరఫున రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. మునునూరు లోని ఎమ్మెల్యే నివాసంలో విరాళపు చెక్కును ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డికి అందచేశారు.

పోలీసు పహారాలో 'ఉపాధి' గ్రామసభ



పనుల వివరాలను వివరిస్తున్న డీఆర్పీ మద్దిలేటి స్వామి

కొండాపురం, సెప్టెంబరు 10: మండలంలోని సాయిపేటలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ రెండవసారి జరిగింది. ఈనెల 8వ తేదీన ఏర్పాటు చేసిన గ్రామ సభలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణతో అర్ధాంతరంగా ముగిసింది. దీంతో టీడీపీ నేత కుంకు మోహన్‌రావు, తదితరులు మళ్లీ గ్రామసభ నిర్వహించాలని కోరగా ఉన్నతాధికారుల సూచనలతో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి (పీఆర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద దాదాపు రూ.2 కోట్లకు పైగా పనులు జరిగాయని ఎస్‌ఆర్‌పీ నీలకంఠం తెలిపారు. గ్రామంలో లేనివారి పేరుతో పనులు చేసినట్లు నగదు విత్‌డ్రా చేయడం, కొలతల్లో వ్యత్యాసాలకు దాదాపు రూ.50లక్షలకు పైగా దుర్వినియోగం అయినట్లు గుర్తించినట్లు తనిఖీ అధికారులు వెల్లడించారు. దీంతో టీడీపీ నేతలు కుంకు మోహనరావు, వల్లూరు వెంకటేశ్వర్లుకు సంబంధించిన రెండు వర్గాల మధ్య మళ్లీ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో అక్కడేవున్న పోలీసులు అప్రమత్తమై ఎస్సై మహేంద్రకు సమాచారం అందించారు. వెంటనే ఆయన పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. ఈనెల 13న మండల కేంద్రంలో సామాజిక తనిఖీ బహిరంగ విచారణ జరుగుతుందని అధికారులు గ్రామసభను ముగించారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిని బయటకుతీసేందుకు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ గ్రామసభను ఉద్దేశ పూర్వకంగా అడ్డుకుంటున్న వీ.వెంకటేశ్వర్లుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని గ్రామ యువనాయకుడు కుంకు రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, గ్రామస్థులు ఓరుగంటి సుమన్, కుంకు మాధవ, వల్లేరు మదన్‌మోహన్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 10: నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ ఒకటవ నెంబరు ప్లాట్‌ఫాం వెయిటింగ్ హాల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ జీ మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించారు. 55-60 మధ్య వయస్కుడు మృతి చెందాడని, మృతదేహంపై క్రీమ్ రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, గ్రే కలర్ ప్యాంట్ ఉన్నాయని, ఒంటిపై జంధ్యం ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్లాట్‌ఫాంపై గుర్తించిన మృతదేహం

గాయపడిన వ్యక్తి..

కావలి రూరల్, సెప్టెంబరు 10: ఉలవపాడు మండలం వీరేపల్లి వద్ద ఈ నెల 6వ తేది రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేగలగడ్డ పుల్లారావు (49) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కావలి పట్టణం పాతూరుకు చెందిన పుల్లారావు ఐదులాంతర్ల సెంటర్ దగ్గర ఆటో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. గత శుక్రవారం ఉలవపాడు మండలం చాగల్లు వద్ద వినాయక విగ్రహం కొనుగోలు చేసుకుని ట్రాక్టర్‌లో కావలికి తీసుకువస్తుండగా ట్రాక్టర్‌ను టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పుల్లారావుకు తీవ్ర గాయాలయ్యాయి. కావలిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య యశోధమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. పుల్లారావు మృతితో పాతూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 10: మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యానాయుడు మేనల్లుడు విజయ రాజేంద్రప్రసాద్‌పై వైసీపీ మాజీ కార్పొరేటర్ సోమవారం దాడికి పాల్పడిన ఘటనపై చిన్నబజారు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... 38వ డివిజన్ ప్రస్తుత కార్పొరేటర్ భర్త, మాజీ కార్పొరేటర్ దాసరి రాజేష్ తనపై దాడి చేశారంటూ చిన్నబజారు పోలీసులకు విజయ రాజేంద్రప్రసాద్‌తోపాటు టీడీపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ చేపట్టి మంగళవారం కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

చురకత్తితో భార్య గొంతుకోసిన భర్త

- పోలీస్ స్టేషన్‌లో సరెండర్
- గంగాదేవిపల్లి హరిజనవాడలో ఘటన



లావణ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జయకృష్ణ

సైదాపురం, సెప్టెంబరు 10: ఇంట్లో కూరగాయలు తరిమేందుకు వాడే చురకత్తితో భార్యను భర్త గొంతుకోసి దారుణహత్యకు పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి అనంతమడుగు పంచాయతీ పరిధిలోని గంగాదేవిపల్లి హరిజన వాడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన చింతలపూడి మహేంద్రకు అదే గ్రామానికి చెందిన లావణ్యతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం. వివాహం జరిగి నప్పటి నుంచి భార్యాభర్తల మధ్య తరచుగా వివాదాలు జరుగుతుండేవి. పెద్దల సమక్షంలో సర్దుబాటు చేస్తూ ఉండేవారు. అందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. భార్య లావణ్య పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమయ్యింది. సుమారు వేకువజామున రెండు గంటల సమయంలో క్షణికావేశంతో అందుబాటులో ఉన్న చురకత్తితో మహేంద్ర భార్య లావణ్య తలపై దాడి చేసి గొంతు కోసి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో సరెండర్ అయ్యాడు. మంగళవారం మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ క్రాంతి కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ విజయకృష్ణ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	124
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6880
వెండి కిలో ధర	రూ. 84,400
వెండి ఒక గ్రాము	రూ. 87.40

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 10: మండలంలోని కసుమూరు సమీపంలో ఉన్న మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు వనంతోపు సెంటర్‌కి చెందిన శ్రీను, రాఘవ పనినిమిత్తం మోటర్ బైక్‌పై కురిచెర్లపాడుకి వెళ్లి వస్తుండగా, కసుమూరు సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి ఆటో అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈప్రమాదంలో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంకటాచలంలోని ప్రైవేటు క్లీనిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగోలుగా ప్రభుత్వ భూముల పందేరం

- డీ ఫారం పట్టాలు మార్చిన రెవెన్యూ అధికారులు
- మొదట ఇచ్చింది ఒకరికి, తాజాగా మరొకరి పేరుతో అడంగల్, 1-బి
- నగదు వసూలు చేసిన వైసీపీ నాయకులు
- లబోదిబోమంటున్న పట్టాదారులు
- విచారించి చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్



కొండాపురం, సెప్టెంబరు10 : స్కాములకేదీ అనర్హం కాదన్నట్లుగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు బయటపడ్డాయి. ఇసుక, మట్టి స్కాములే కాకుండా పట్టా, డీఫారం భూములను కూడా గత పాలకులు వదల్లేదు. వైసీపీ పాలనలోని చివరి ఏడాదిలో ఈభూముల మార్పిడి స్కాము జరిగింది. కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే ఈ వ్యవహారంలో వైసీపీ నాయకులకు సహకారం అందించారు.

● ప్రతి గ్రామంలోనూ భూమార్పిడి

అనాది నుంచి రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వభూమిని గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు డీ-ఫారం పట్టాలు కేటాయించారు. రికార్డుల్లో పేర్లుమార్చి లబ్ధిదారులకు హక్కులు కల్పించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిపొందిన లబ్ధిదారులు ఆభూమిని సాగుచేసుకొని, బ్యాంకులో రుణాలు తీసుకొని పంటలు సాగు చేసుకుంటుంటారు. ఈభూమిని అమ్మేందుకు వీలుకాదు. ఇంతవరకు బాగానే ఉన్నా గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దల కళ్లు ఈ భూములపై పడ్డాయి.

● ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు

ప్రభుత్వం అన్ని హక్కులు కల్పించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చినా ఆన్‌లైన్లో వారి పేరుతో సదరు భూమి అడంగల్, 1-బీ ఉండదు. ఇదే అదనుగా భావించిన కొందరువ్యక్తులు రెవెన్యూ అధికారుల సాయంతో పెద్ద ఎత్తున స్కాములకు శ్రీకారం చుట్టారు. భూములు ఇప్పిస్తామంటూ కొంతమంది ప్రజలకు ఆశచూపి వారి వద్ద నుంచి ఎకరానికి రూ.20 నుంచి రూ. 40 వేల వరకు వసూలుచేశారు. తహసీల్దార్ సహకారంతో ఆన్‌లైన్లో అడంగల్, 1-బీని మార్చారు. అసైన్డ్ భూములనేకాక పట్టాదారు(రిజిస్ట్రేషన్ జరిగి ఉన్న భూములు) భూములను మార్చారు.

● గ్రామంలో లేని వారి పేర్లు

గ్రామానికి ఎలాంటి సంబంధంలేని వ్యక్తులపేర్లపై భూములను మార్చారని కొందరు రైతులు తెలియచేస్తున్నారు. సత్యవోలు గ్రామంలో సర్వే నెంబరు 275-4లో 18 ఎకరాల భూమిని కావలి మసునూరు గ్రామానికి చెందిన నలుగురు ముస్లింల వద్ద నుంచి నగదు వసూలుచేసి వారి పేర్లతో ఆన్‌లైన్లోకి మార్చారు. ఇటీవల వారు అక్కడకువచ్చి ఇది మాభూమి మీరెందుకు సాగుచేస్తున్నారని అసలు పట్టాదారులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం సద్దుమణిగింది. అలాగే ఉప్పలూరులో సర్వే నెంబరు 157లో రిజిష్టరు పట్టాలో గ్రామానికి ఏమాత్రం సంబంధంలేని గుడవల్లూరుకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి పేరుతో ఉందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చింతలదీవి గ్రామ సర్వే నెంబరు 67-3లో గరిమెనపెంట పంచాయతీకి చెందిన నడిపి చినబాబులు పేరుతో ఉండటాన్ని గమనించిన భూయ జమాని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తి ఆభూమికి నాకు, నా కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని, దాన్ని ఆన్‌లైన్లో తొలగించాలంటూ తహసీల్దార్‌కు అంగీకార పత్రం అందచేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో భూమార్పిడి వ్యవహారం జరిగిందని పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవ్యవహారం తమ పరిధిలో జరగలేదని మండల రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. వీఆర్‌వోలతో సంబంధంలేకుండా వ్యవహారం జరిగినట్లు మండలవాసులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టరు, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరిగిన భూమార్పిడి వ్యవహారంపై విచారించి మండల వాసులు కోరుతున్నారు. ఈవిషయంపై తహసీల్దార్ సుందరమ్మను వివరణ కోరగా తనకు ఫిర్యాదులు అందాయని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



మార్పిడి జరిగిన లింగనపాలెంలోని భూమి

బత్తాయికి తెగుళ్లు.. చెట్ల నరికివేత

రేయింబవళ్లు కష్టించి కన్నబిడ్డల్లా పెంచుకున్న బత్తాయి చెట్లకు తెగుళ్ల విజృంభించడం, ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఏకంగా చెట్లనే నరికివేశాడు ఓ కర్షకుడు. దుత్తలూరు మండలం సోమలరేగడ గ్రామానికి చెందిన రైతు పెద్దిరెడ్డి వెంకటరెడ్డి తనకున్న అరెకరా పొలంలో ఏడేళ్ల క్రితం బత్తాయి మొక్కలు నాటాడు. అయితే, ఆ చెట్లకు వేరుకుళ్లు, బంక, ఎండుపుల్ల వంటి తెగుళ్ల విజృంభించాయి. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి మందులు పిచికారీ చేసినా తగ్గలేదు. దీనికితోడు దిగుబడి సక్రమంగా రాకపోవడంతో ఏకంగా కూలీలను పెట్టి చెట్లను నరికేశాడు. వస్తున్న నష్టాలను భరించలేకే తాను బత్తాయి చెట్లను నరికేయించినట్లు రైతు వెంకటరెడ్డి ఆవేదన చెందారు.

- దుత్తలూరు (ఉదయగిరి రూరల్)

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 10 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 17వతేదీ వరకు పొడిగించినట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ఎంపీపీ, ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ ఏడాదికి రూ.3.50లక్షలలోపు ఆదాయం ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. విద్యార్థులకోసం ఈనెల 17వతేదీ వరకు వెబ్ సైట్ పనిచేస్తుందని, దరఖాస్తు సమయంలో ఆధార్‌లో ఉన్న విధంగానే వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీసీ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. డిసెంబరు 8వతేదీన జరిగే ఈ పరీక్షకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.bseap.gov.in వెబ్‌సైట్‌లో కానీ దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలోకానీ సంప్రదించాలని తెలిపారు.



జూడో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సౌత్‌జోన్ జూడో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 10 : చెన్నైలో బుధవారం నుంచి జరగనున్న 4వ ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళల జూడో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిషోర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారని, వారికి పూర్తి సహాయ, సహకారాలను అందచేస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్, ఏపీ జూడో సంఘం సీఈవో కేఎస్ బాబు, జిల్లా సభ్యులు ఎండీ మునవిర్‌హుస్సేన్, వీవీ శశిధర్, ఏడుకొండలు, సాయి సుమంత్, టీమ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సౌత్ ఏషియన్ ఆట్యాపాట్యాకు పూజిత



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 10 : భూటాన్ దేశంలో గురువారం నుంచి జరిగే 8వ సౌత్ ఏషియన్ ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు నెల్లూరులోని బీవీఎస్ బాలికల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థిని తుమ్మల పూజిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పీ విజయజ్యోతి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. అంతర్జాతీయ పోటీలకు హాజరయ్యేందుకు విద్యార్థినికి పాఠశాల సిబ్బంది సహకారంతో రూ.23వేలు ఆర్థిక సాయం అందచేశామని చెప్పారు. భూటాన్‌లో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని పూజితను, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలువాయి, సెప్టెంబరు 10: చింతలపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. మంగళ వారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన ప్రభుత్వ భూమే గా...చేసేయ్ కబ్జా అనే వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు సంజీవ కుమారి ఆదేశాల మేరకు ఆర్‌ఐ మస్తాన్‌వలి, వీఆర్వో జనార్దన్ భూమిని పరిశీలించారు. ఇది ప్రభుత్వ భూమి అని ఇందులో ప్రవేశించిన వారిపై చర్యలు అని అక్కడ బోర్డు పెట్టించారు. ఈ భూమిలో ఎవ్వరూ ప్రవేశించినా వెంటనే సమాచారం అందించాలని గ్రామ వీఆర్‌ఏ తిరిపాలను ఆదేశించారు. ఇటీవల ఈ గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందోనని రీ సర్వే సిబ్బందితో తెలుసుకుని అక్రమార్కులు ఈ కబ్జాకు పాల్పడి ఉంటారని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఇది ఎవరో బయట వ్యక్తులు పనే అయి ఉండవచ్చు అని అంటున్నారు.

వైద్య చికిత్సల్లో నిర్లక్ష్యం వద్దు

- సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 10 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య చికిత్సల్లో నిర్లక్ష్యం వీడాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొందరు వైద్యులు ఆసుపత్రిలో ఉండకుండా మధ్యాహ్నమే వెళ్లిపోతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు వైద్యులు, సిబ్బంది ఎమర్జెన్సీ రోగులను బయట ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నట్లు తెలిసిందని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన వైద్య పరికరాలు, వసతుల వివరాలు తెలియజేయాలన్నారు.

పల్లెపాడు గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి : కలెక్టర్

ఇందుకూరుపేట, సెప్టెంబరు 10: మండలంలోని పల్లెపాడులో ఉన్న మహాత్మాగాంధీ సబర్మతి ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమానికి తొలిసారిగా వచ్చిన కలెక్టర్‌కు ఆశ్రమ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోశాల, అతిథి గృహాన్ని పరిశీలించారు. గాంధీజీపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కేంద్రాన్ని పరిశీలించి, గాంధీజీకి ఆశ్రమానికి ఉన్న అనుబంధాన్ని తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సబర్మతి ఆశ్రమాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆశ్రమానికి రక్షణగా ఉన్న పెన్నానదికి రిటైనింగ్ వాల్ లేదా రివిట్‌మెంట్ నిర్మించాలని రైతులు కోరారు. పొర్లుకట్ట నుంచి ఆశ్రమానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి :

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తూరు ఎస్టీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న గుడ్లు, బాలామృతం, చిక్కీలు, కర్జూరం తదితరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారులంతా ప్రతిరోజూ నూరుశాతం కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. పిల్లల ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా, ప్రతి చిన్నారి పౌష్టికాహారం క్రమం తప్ప కుండా తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రాజ్యలక్ష్మీ, టీచర్ పద్మలత, సూపర్‌వైజర్ లలితాంబ, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో తినుబండారాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

కేన్సర్ రహిత కోవూరు లక్ష్యం

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- వారం రోజులపాటు మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 10 : కేన్సర్ రహిత కోవూరు నియోజకవర్గమే లక్ష్యంగా ఉచితంగా స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కొత్తూరులో వీపీఆర్ ఫౌండేషన్, టీటీడీ స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించే మొబైల్ పింక్ బస్సును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రశాంతి మాట్లాడుతూ నియోజకవర్గంలో వారం రోజుల పాటు ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ కేన్సర్ స్ర్కీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ రోగులు కూడా ఈ బస్సు వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే, వారికి ఆరోగ్యశ్రీ లేదా టీటీడీ ప్రాణదాత ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని వివరించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రెండు, మూడు దశల్లోనే కేన్సర్‌ను గుర్తిస్తే వైద్యం చేయడం సులువు అవుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్ మాట్లాడుతూ రూ.10వేల వరకు ఖర్చయ్యే ఈ పరీక్షలను వీపీఆర్ ఫౌండేషన్, స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రూ.3.5 కోట్ల విలువైన ఈ మొబైల్ బస్‌ను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వేమిరెడ్డి దంపతులు స్విమ్స్‌కు విరాళంగా అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, పి.చెంచుకిషోర్ యాదవ్, రంగారావు, ఏడుకొండలు, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, స్విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల పింక్ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కారు ఢీకొని ఒకరు దుర్మరణం

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలోని బురాన్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు ఢీకొని ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీకి చెందిన ఈ చెంచయ్య (40) బురాన్‌పూర్ వద్ద పనికి వెళ్లి ఇంటికి వెళ్లేందుకు రహదారి దాటుతుండగా నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంచయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కారు ఢీకొని మృతి చెందిన చెంచయ్య

పంచాయతీలకు మహర్దశ!

● 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
● తాగునీరు, పారిశుధ్యం,
రహదారుల మరమ్మతులకు మోక్షం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 10: వైసీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. వీటికి విడుదలైన నిధులు, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా వాటిని దారి మళ్లించి పల్లెల అభివృద్ధిని మరిచింది. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నడుం బిగించింది. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రెండు విడతలుగా నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో తాగు నీటివసతి, పారిశుధ్యం మెరుగుతో పాటు రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో ఉత్సవ విగ్రహాలుగా ఉన్న సర్పంచ్‌లు కూటమి ప్రభుత్వంలో కింగ్‌లుగా మారనున్నారు.

నిధులు విడుదల: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 143 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రెండు విడతులుగా టైడ్, అన్‌టైడ్ నిధులను విడుదల చేసింది. గత ప్రభుత్వంలో నిధుల విడుదల ప్రకటన తప్ప వాటిని డ్రా చేసి సర్పంచులు పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టిన పాపాన పోలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్, ఇతరత్రా బిల్లుల పేరుతో దారి మళ్లిం చడంతో పంచాయతీలు అభివృద్ధికి నోచుకోక కునారిల్లిపోయాయి. కనీసం సమావేశాలు నిర్వ హించేందుకు, బ్లీచింగ్ చల్లేందుకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శు లు తమ జేబులో నగదు ఉపయోగించేవారు. ఉదయగిరి మండలంలోని 17పంచాయతీలకు రూ.52.26 లక్షల టైడ్, రూ.34.84లక్షల అన్‌టైడ్ నిధులు మంజూరయ్యాయి.

ప్రాధాన్యత క్రమంలో ఖర్చు

పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలి. ప్రధానంగా 60శాతం నిధులను తాగునీటి వసతి, పారిశుధ్యం మెరుగుకు, 40శాతం నిధులను రహదారుల నిర్మాణానికి ఖర్చు చేయాల్సి ఉంది.

- మల్లికార్జున,
ఈవోపీఆర్డీ, ఉదయగిరి


ఉదయగిరి రూరల్: కంకర తేలి అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 10: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని కౌలురైతు సంఘం, రైతు సంఘాల నాయకులు గంటా లక్ష్మీపతి, లక్కు కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి వారు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలురైతుల వ్యవసాయ ఖర్చులను వారి బ్యాంకు ఖాతాలో జమచేయాలని తెలిపారు. కౌలు రైతులను ప్రభుత్వమే గుర్తించి వారికి సీసీఆర్ కార్డులను అందజేయాలని కోరారు. వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను నిలుపుదల చేయాలని, సోమశిల ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న అప్రాన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రక్షణ గోడ లేని ప్రమాదకర బ్రిడ్జి

అనంతసాగరం, సెప్టెంబరు 10: అనంతసాగరం - బద్వేల్ ప్రధాన రహదారిలోని గౌరవరం పల్లవోలు వాగుపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. గతంలో నిర్మించిన ఈ బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం చేపట్టక పోవడంతో ఈ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు పడిన సమయంలో ఈ వాగు ఉగ్రరూపం దాల్చి బ్రిడ్జి పై నుంచి ప్రవాహం కొనసాగడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


గౌరవరం సమీపంలోని పల్లవోలు వాగుపై ఉన్న బ్రిడ్జి

మొక్కుబడిగా సంగం మండల సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

సంగం, సెప్టెంబరు 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీ డీవో గోపి సమావేశంలో చర్చించాల్సిన అంశాలను వివరించారు. అనంతరం పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖ, ఇరి గేషన్, విద్యాశాఖ, ఎన్‌ఆర్‌ఈజీ ఎస్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు అసంపూర్తిగా ఉన్న జలజీవన్ పనులపై ప్రశ్నించారు. నిధుల కొరతతో పనులు నత్తనడకన జరుగుతున్నాయని త్వరలోఈ పనులను పూర్తి చేసి తాగునీటిని అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 10: కొట్టాలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి పీ.శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యనిర్వా హణాధికారి ఆర్.పోలయ్య తెలిపారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సభ్యులతో ప్రత్యేక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘంలో సొంత, కౌలు భూమి లేని, గత కొన్నేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులను తొలగిస్తామన్నారు. కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులు పొలం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫొటోలు, ఫోన్ నెంబర్ కార్యాలయంలో అందజేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సభ్యుడిగా ఉండి చనిపోయిన వారి సభ్యత్వాన్ని రద్దు చేయనున్నట్లు తెలిపారు. వాయిదాలు మీరిన బకాయిదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ మల్లికార్జున, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలపై చర్యలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 10: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 17పంచాయతీల్లో 1.4.2023 నుంచి 13.3.2024 వరకు రూ.8.79కోట్లతో చేపట్టిన 515 రకాల పనులపై పది రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టింది. ఆ వివరాలను బహిరంగ చర్చావేదికలో అధికారులు వివరించారు. పనుల్లో జరిగిన అక్రమాలపై బృంద సభ్యులు ఏకరవు పెట్టారు. రూ.3.80లక్షల రికవరీకి ఆదేశాలు జారీ చేసి, రికవరీ సిబ్బందికి డ్వామా కార్యాలయం నుంచి త్వరలో నోటీసులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ గాయత్రి దేవి, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, ఎస్ఆర్పీ నాగార్జున, క్వాలిటీ కంట్రోల్ ఈఈ, ఈసీ వేణుగోపాల్, కిశోర్, పీఆర్ ఏఈ రవీంద్ర, ఏపీవో బ్రహ్మయ్య ఉన్నారు.


ప్రజావేదిక నిర్వహిస్తున్న అడిషనల్ పీడీ విజయలక్ష్మి

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతసాగరం, సెప్టెంబరు 10: బొమ్మవరం చెరువులో ఐదెకరాల భూమిని ఆక్రమించి పామాయిల్ సాగు చేసిన వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో మంగళవారం అధికారులు స్పందించారు. డిప్యూటీ తహసీల్దారు గిరీష్, ఆర్ఐ రమేష్, ఇరిగేషన్ ఏఈ ఖాదర్‌లు ఆక్రమించిన చెరువును పరిశీలించి బాధ్యులకు నోటీసులు అందజేశారు. ప్రభుత్వ భూమిలో దిగరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 10: స్థానిక రేడియన్స్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం సభ్యులు 6-10వ తరగతి విద్యార్థులకు నైతిక తయే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సన, మహమ్మది, రెహానా, వసీమా, రుక్సాన, సాదియా, పర్వీన్, అమీరా పాల్గొన్నారు.




తహసీల్దారుకు చెక్కు అందజేస్తున్న వేమా మల్లికార్జునరావు దంపతులు

వరద బాధితులకు ఆర్థికసాయం

సంగం, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సంగం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వేమా మల్లికార్జునరావు దంపతులు మంగళవారం రూ.11,116 చెక్కును తహసీల్దారు సోమ్లానాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వేమా దంపతులను తహసీల్దారు అభినందించారు. దాత అందజేసిన చెక్కును కలెక్టర్ ద్వారా సీఎం సహాయ నిధికి పంపుతామన్నారు.

వరికుంటపాడులో జోరుగా మద్యం అమ్మకాలు

వరికుంటపాడు, సెప్టెంబరు 10: మండలంలోని గ్రామాల్లో బెల్టు దుకాణాల పుణ్యమాని మద్యం వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ప్రతినిత్యం ఆ గ్రామాల్లోని నిర్వాహకులు పోటీగా వ్యాపారం సాగిస్తూ ఒక్కో సీసాపై అదనంగా రూ.50నుంచి రూ.100వరకు వసూలు చేస్తూ రూ.వేలల్లో జేబులు నింపుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తుండడంతో అక్కడే తిష్ట వేస్తున్నారు. మద్యంప్రియుల తాకిడితో ప్రజలు విస్తుపోతున్నారు. విరువూరు, కోటవర్ధినిపల్లి, కాంచెరువు, గువ్వాడి, ఇస్కపల్లి, వరికుంటపాడు, తూర్పురొంపిదొడ్ల, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న హోటళ్లు, దుకాణాల్లో సాగిస్తున్న వ్యాపారంతో అటుగా వెళ్లే ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కుటుంబాల్లో సైతం వివాదాలు తలెత్తుతుండటంతో ఏ క్షణంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయో అని బెంబేలెత్తిపోతున్నారు. అమ్మకాలు నిలిపివేయాలని సూచించిన గ్రామస్థులపై నిర్వాహకులు ఎదురుదాడికి దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు మాత్రం ముందస్తుగానే నిర్వాహకులకు సమాచారం అందించి మొక్కుబడి తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి బెల్టు నిర్వహణకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంచెరువు సచివాలయంలో వసతుల కరువు

వరికుంటపాడు, సెప్టెంబరు 10: కాంచెరువు సచివాలయంలో సరైన వసతులు లేక ఉద్యోగులు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయ నూతన భవన నిర్మాణం పనులు చేపట్టినా పనులు పూర్తి కాకుండానే మధ్యలోనే నిలిచిపోయాయి. అధికారులు చేసేదిలేక పంచాయతీ కార్యాలయంలోని ఓ చిన్న గదిలో ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయ ప్రాంగణంలోనే గడ్డివాములు ఉండటంతో పాటు చుట్టూరా ఏపుగా రకరకాల కంప, పిచ్చిమొక్కలు పెరిగాయి. అందులో నుంచి విష పురుగులు సంచరిస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సచివాలయం ఆవరణలోని గడ్డివామి

తాగునీటి పథకాల

నిర్వహణ అధ్వానం

● కలుషిత నీరు సరఫరా ● అధికారుల పర్యవేక్షణ కరువు
● ఆందోళన చెందుతున్న ప్రజలు

కందుకూరు, సెప్టెంబరు 10 : నియోజకవర్గంలోని 90 శాతం గ్రామాలకు రక్షిత మంచినీరు అందించే ఉద్దేశంతో రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా నిర్మించి ఉన్న మూడు సీపీడబ్ల్యూ స్కీంల నిర్వహణ అధ్వానంగా మారింది. రిజర్వాయరులో చేపల పెంపకం కోసం వేసిన మేతలకు తోడు అడుగంటిన రిజర్వాయర్‌లో చేపలు పడుతుండటంతో జలాలు కలుషితమవుతున్నాయి. ఆ నీటిని యథాతథంగా పంప్ చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని గ్రామాలకు రాళ్లపాడు-రోళ్లపాడు, చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకాల ద్వారా గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని గ్రామాలకు గుడ్లూరు మంచినీటి పథకం ద్వారా రక్షిత నీటిసరఫరా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పథకాలకు మూడింటికి కలిపి రాళ్లపాడు రిజర్వాయరులో ఒకే ఇన్‌టేక్ వెల్ ఉండగా గుడ్లూరు మంచినీటి పథకం కోసం కొత్తపేట సమీపంలో, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాల కోసం పెంట్రాల సమీపంలో ఫిల్టర్‌బెడ్‌లు, పంప్‌హౌస్‌లు నిర్మించి ఈ పథకాలను నిర్వహిస్తున్నారు. ఈ మూడు పథకాల ద్వారా నియోజకవర్గంలోని 105 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా జరుగుతోంది. అయితే పేరుకు రక్షితనీరే కానీ నీటిని నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయకుండా నేరుగా పంప్ చేస్తుండటంతో ఈ నీరు దుర్వాసన వస్తున్నది. ఈ నీటిని తాగేందుకు ఎవరూ సాహసించే పరిస్థితి లేకపోగా, కనీసం వాడుకోవాలన్నా కంపు కొడుతుండటంతో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ నీటిని వాడితే ఒళ్లు జిల, ఇతర చర్మవ్యాధులు కూడా వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


రాళ్లపాడు రిజర్వాయరులో నిర్మించి ఉన్న ఇన్‌టేక్ వెల్


సీపీడబ్ల్యూ స్కీంల ద్వారా సరఫరా అవుతున్న నీరు

● పైప్‌లైన్లలో చేపలు, కప్పలు

మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో చేపలు, కప్పలు కూడా పైప్‌లైన్లలో వచ్చి మంచినీటి ట్యాంకులలోకి చేరుతున్న పరిస్థితి. వలేటివారిపాలెం మండలం నేకునాంపురంలో ఈ పథకం నీరు వచ్చే నేలబావి(సంపు)లోకి మూడురోజులక్రితం చనిపోయిన చేపలు వచ్చి పడటంతో ఆ పరిసరాల్లో దుర్గంధం చెలరేగింది. గ్రామస్థులు పరిశీలించగా నేలబావిలో చేపలు తేలుతుండటంతో ఆ నీటిని వెళ్లగొట్టి నేలబావిని శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాళ్లపాడు రిజర్వాయరు నుంచి ఇన్‌టేక్ వెల్ ద్వారా చేపలు వస్తుండగా ఆ నీటిని నేరుగా భారీ పంపులతో పంపింగ్ చేస్తుండటం వల్ల ఇలా చేపలు, కప్పలు వస్తున్నాయని పలుచోట్ల పైప్‌లైన్లు ఎయిర్‌వాల్వ్‌ల వద్ద బ్లాక్ అవుతున్న పరిస్థితి ఉందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మంచినీటి పథకాల నిర్వహణ ఇంత అధ్వానంగా ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసం పట్టించుకోవటం లేదని, దీంతో తమకు తిప్పలు తప్పటం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకే కల్వర్టు తొలగింపు

● సబ్ కలెక్టరుకు విన్నవించిన ఓగూరు ఆది ఆంధ్రకాలనీ వాసులు

కందుకూరు, సెప్టెంబరు 10: మండలంలోని ఓగూరు ఆది ఆంధ్రకాలనీ వద్ద గత ప్రభుత్వం చివర్లో అక్రమంగా చెరువు వరవపై నిర్మించిన పైపు కల్వర్టును కోర్టు ఉత్తర్వులను అనుసరించి తొలగించామని ఆ కాలనీ వాసులు, టీడీపీ నాయకులు సబ్ కలెక్టరు టి.శ్రీపూజకు వివరించారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఆదిఆంధ్రకాలనీ నుంచి ప్రధాన రహదారిని అనుసంధానం చేస్తూ 30 అడుగుల రహదారి, శ్లాబు కల్వర్టు ఉండగా 2023 చివర్లో గ్రామ వైసీపీ నాయకులు చెరువుకి వర్షపు నీరు ప్రవహించే వరవకు అడ్డంగా పైపులు వేసి మరో కల్వర్టు నిర్మించారని తెలిపారు. దీంతో చెరువుకి నీటిప్రవాహానికి అడ్డంకిగా మారి కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అప్పట్లోనే అభ్యంతరం చెప్పినా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించేశారన్నారు. ఈ క్రమంలో కోర్టుకు వెళ్లగా ఆ కల్వర్టును తొలగించమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని వివరించారు. ప్రస్తుతం పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో దానిని తొలగించగా అదేదో అక్రమం అన్నట్లుగా వైసీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని, వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఈ సమస్య జఠిలం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఓగూరు ఆదిఆంధ్రకాలనీ వాసులు, టీడీపీ ఎస్సీ సెల్ నేత రాయపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న ఆదిఆంధ్రకాలనీ వాసులు, టీడీపీ నాయకులు

ఉత్సాహంగా వినాయక నిమజ్జనం

కావలి రూరల్, సెప్టెంబరు 10: కావలి మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో స్వామివారిని ఊరేగిస్తూ తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం తీరప్రాంతానికి తరలించారు. కొత్తపల్లిలో సోమవారం రాత్రి వినాయక విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కొత్తపల్లిలో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

భక్తులకు అన్నదానం

బిట్రగుంట : బోగోలు మండలం వినాయక చవతి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల వద్ద కమిటీ సభ్యులు 4వ రోజు మంగళవారం అన్నదాన కార్యక్రమాలు చేశా రు. విశ్వనాథరావుపేటలో రెండు చోట్ల స్థానిక టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన విగ్రహాలను కావలి ఎమ్మెల్యే దగుమా టి వెంకటక్రిష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఎల్.సుధాకర్‌బాబు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, యన్నాబత్తిన శీనయ్య, తదితరులు గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఉట్టికొట్టి యువతను ఉత్సాహపరిచారు.


ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి

15 లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

లింగసముద్రం, సెప్టెంబరు 10 : మండలంలోని రైతులు ఈ నెల 15వ తేదీ లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహంలింకన్ చెప్పారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని తమ శాఖ వీఏఏల వద్ద ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే 24వ తేదీ నుంచి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు నజీర్, ప్రేమ్ బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

వలేటివారిపాలెం, సెప్టెంబరు 10 : తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని రోళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, సుజాత, తదితరులు పాల్గొన్నారు.


రోళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలి

బిట్రగుంట : పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని సమపాలలో ఇవ్వాలని ఐసీడీఎస్ కావలి సీడీపీవో సౌజన్య సూచించారు. బోగోలు మండలం జేపీ గూడూరు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో సౌజన్య

కందుకూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమ బదిలీ

కందుకూరు : కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పెళ్లకూరు పూర్ణిమ చిత్తూరు జిల్లా పాకాల సబ్‌కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేస్తూ హైకోర్టు పరిపాలనా అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్ణిమ ప్రస్తుతం మంగళగిరిలోని జ్యూడిషియల్ అకాడమీలో శిక్షణలో ఉండగా ఆ శిక్షణ పూర్తయి ఒంగోలు జిల్లా కోర్టులో ప్రయోగాత్మక శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం పాకాల జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. కందుకూరులో జూనియర్ సివిల్ న్యాయాధికారి నియామకం జరిగే వరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి పూర్తిస్థాయిలో ఈ అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలి

కందుకూరు, సెప్టెంబరు 10: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద్‌మోహన్ అన్నారు. స్థానిక కోటారెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు మురళి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాస్తారోకోకు పిలుపునివ్వగా ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన పోలీసులే కార్మికులను భయభ్రాంతులను చేసి ఉద్యమాన్ని అణగదొక్కాలని ప్రయత్నించారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ఎన్నికల సందర్భంగా ప్రస్తుత పాలకులు చెప్పారని వారి మాటను నిలబెట్టుకునేలా గుర్తుచేసేందుకు చేపట్టిన ఉద్యమాన్ని అణచాలని చూడటం దేనికి సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలనే తిరిగి ఈ ప్రభుత్వం చేస్తే ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నత్తా రామారావు, కోటేశ్వరరావు, ఉప్పుటూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఆర్'కు భారత్ ఆర్మీ ర్యాలీ

బిట్రగుంట, సెప్టెంబరు 10: చియాచిన్ నుంచి ఇందిరాపాట్ (అండమాన్ నికోబార్ దీవులు) వరకు 5,500 కిలో మీటర్లు సైకిల్ ర్యాలీ చేపట్టిన 60 మంది ఇండియన్ ఆర్మీ జవానులు మంగళవారం బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకున్నారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు బీటెక్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఇండియన్ ఆర్మీలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ ర్యాలీ ఇన్‌చార్జిలు అభినవ్‌రావత్, అభిజిత్ సింగ్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై ఆలోచించే వారే ఉత్తమ ఉపాధ్యాయులు


చెంచయ్యను అభినందిస్తున్న ఎంఈవో, తదితరులు

అల్లూరు, సెప్టెంబరు 10 : ఏదో ఉద్యోగం చేసుకుంటున్నాం అన్నట్టు కాకుండా విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించే ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడేనని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చెంచయ్యను మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈ వో-2 సునీత, విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు, రామకృష్ణ హెడ్‌మాస్టర్ గంగిరెడ్డి, నాయకులు మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

బిట్రగుంట, సెప్టెంబరు 10: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆ శాఖ ఏఈ నాగూరువల్లి తెలిపారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురం విద్యుత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సూచనల మేరకు పనులు ప్రారంభించామని తెలిపారు. కావలి నుంచి బోగోలు మండలాకి వచ్చే 33కేవీ లైను 17 కిలోమీటర్లు ఉండటంతో కట్‌పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. దగదర్తి నుంచి 33కేవీ లైను నుంచి చెంచులక్ష్మీపురం సబ్ స్టేషన్‌కు సరఫరా అయ్యేలా చేశామన్నారు. తాటిచెట్లపాలెంలో దాదాపు 15 కిలోమీటర్ల విద్యుత్ లైన్ మార్చి కొత్త లైను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోగోలు, విశ్వనాథరావుపేట, బేతనీపేటలో దెబ్బతిన్న విద్యుత్ స్తం భాల మార్చినట్లు తెలిపారు. ముంగమూరు సబ్‌స్టేషన్ నుంచి శ్రీవేంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ వరకు త్రీఫేస్ లైన్ తీసుకువచ్చామన్నారు. కొన్ని సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట లైన్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి, లైన్‌మన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆశలు ఫలించేనా ?

- కనుపూరు చెరువు రిజర్వాయర్‌గా మారేనా..
- సర్వేలతోనే సరి.. మరి నిర్మాణమెప్పుడో ?
- ఎదురు చూస్తున్న రైతన్నలు

వెంకటాచలం, సెప్టెంబరు 10 : మండలంలో వ్యవసాయానికి ఆయువుపట్టుగా మూడు చెరువులున్నాయి. మొదటిది సర్వేపల్లి రిజర్వాయరు కాగా రెండోది కనుపూరు చెరువు, మూడోది ఇడిమేపల్లి చెరువు. సర్వేపల్లి చెరువుకు బ్రిటీషు కాలంలోనే రిజర్వాయరు హోదా కల్పించారు. అయితే పడమటి గ్రామాలకు ఆయువుపట్టు అయిన కనుపూరు చెరువును రిజర్వాయరు చేయాలని దీర్ఘకాలంగా రైతులు కోరుతున్నారు. దీని పరిధిలో సుమారు 10 వేల ఆయకట్టు ఉంది. ఈ చెరువు విస్తీర్ణంలో ఎంతో పెద్దదే కాకుండా, దీనికి నీటిని తీసుకువచ్చే పరివాహకప్రాంతం ఎక్కువగా ఉంది. దీనికి తోడు ఈ చెరువుకు సోమశిల జలాలను తీసుకువచ్చే కాలువ కూడా ఉంది. అందువల్ల ఈ చెరువును రిజర్వాయరుగా అభివృద్ధి చేస్తే ఆయకట్టులో రెండు పంటలకు నీరిచ్చే అవకాశం ఉంటుంది.

● రిజర్వాయరు ఏర్పాటుకు సర్వేలు

పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో కనుపూరు చెరువును రిజర్వాయరుగా అభివృద్ధి చేయాలని భావించారు. ఈ మేరకు 2003లో ఒకసారి సర్వే చేయించారు. తదనంతరం 2004 ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో మళ్లీ ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో రైతుల్లో రిజర్వాయరు ఆశ మళ్లీ మొదలైంది. అంతే కాకుండా గత ఐదేళ్ల కిందట మరోసారి సర్వే చేశారు. అయితే ఈ ప్రతిపాదనలు సర్వే దశలోనే ఆగిపోయాయి.

● తాగునీటికి అండ

మండలంలోని పడమటి గ్రామాలన్నీ మెట్టగ్రామాలే. ఈ గ్రామాల్లో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఉంటుంది. కనుపూరు చెరువును రిజర్వాయరుగా మారిస్తే కనుపూరు, వెంకటాచలం, కందలపాడు, చవటపాళెం, వెంకటక్రిష్ణాపురం, కసుమూరు, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు, శ్రీరామపురం, ఇస్లాంపేట, పుల్లతీగలపాడు గ్రామాలతోపాటు మనుబోలు మండలంలోని చెరుకుమూడి, ముద్దుమూడి, కొమ్మలపూడి గ్రామాలకు కూడా తాగునీటిని సరఫరా చేయడానికి అవకాశం కలుగుతుంది.


కనుపూరు చెరువు

జిల్లా అధికారులు దృష్టి పెట్టాలి



కనుపూరు చెరువును రిజర్వాయరుగా మార్చగలిగితే రెండు మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. గతంలో జరిగిన సర్వేలను గణనలోకి తీసుకుని జిల్లా అధికారులు చెరువును రిజర్వాయరుగా మార్చే కార్యక్రమంపై దృష్టిపెట్టాల్సి ఉంది.
- ఉప్పలపాటి ధనుంజయనాయుడు, రైతు, కనుపూరు

నవధాన్యాలతో భూసారం పెంపు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 10: పచ్చిరొట్ట స్థానంలో నవధాన్యాలు ఉపయోగించడం ద్వారా భూసారం పెరుగుతుందని ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నరుకూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శిరీషారాణితో కలిసి ఆయన రైతులకు సూచనలిచ్చారు. నవధాన్యాలు 10 కేజీల బస్తా రూ.వెయ్యి కాగా, సబ్సిడీతో రూ.200కు అందచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకూరుపేటకు 800 బస్తాలు, తోటపల్లిగూడూరుకు 111, ముత్తుకూరుకు 300 బస్తాలు కేటాయించినట్లు ఏడీఏ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నిరీష, మాజీ ఎంపీటీసీ పాకం వెంకయ్య, రైతులు అన్నం దశరథరామయ్య, ఎం. లక్ష్మీనారాయణ, పోతు పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పరిశీలన

ఇందుకూరుపేట, సెప్టెంబరు 10: మండలంలోని డేవిస్‌పేటలో నిర్వహిస్తున్న 104 ఉచిత వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మంగళవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. 104 వాహనం ద్వారా వైద్య శిబిరానికి వచ్చే డాక్టర్లు, సిబ్బంది టైమింగ్స్ పాటించాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ నవీన్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

● పట్టించుకోని అధికారులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 10 : బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకూరుపేట సెబ్‌స్టేషన్ పరిధిలోని ముత్తుకూరు, టీపీగూడూరు, ఇందుకూరుపేట మండలాల్లో సుమారు 60 బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఈ షాపుల్లో రోజుకు రూ.3లక్షల పైబడి మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. సెబ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో వారే దగ్గరుండి బెల్టు షాపులకు వేలంపాట నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వరకు ఇసుక అక్రమ రవాణాలో అక్రమ వసూళ్ల దందా సాగిస్తున్నా సెబ్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే అడ్డుకోవడంతో సెబ్ అధికారులే కొంతమంది వ్యక్తులను బెల్టు షాపులు నడుపుకోమని చెప్పడం కొసమెరుపు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, మండలాల ప్రజలు కోరుతున్నారు.

14 నుంచి స్వచ్ఛతా హి సేవ ప్రారంభం : డీపీవో

మనుబోలు, సెప్టెంబరు 10: ఈనెల 14 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ప్రారంభమవుతుందని డీపీవో సుస్మిత తెలిపారు. మనుబోలు పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం జిల్లాలోని కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 722 పంచాయతీల్లో 517 పంచాయతీల్లో మాత్రమే చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయన్నారు.అందులో 486 కేంద్రాలు మాత్రమే సక్రమంగా నడుస్తున్నాయన్నారు. మిగతా వాటిని అక్టోబరు 2నాటికి సిద్ధం చేస్తామన్నారు. 14నుంచి స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా 15రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి కార్యదర్శి చెంచుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో సుస్మిత

పడుగుపాడు సొసైటీలో రక్తదాన శిబిరం

కోవూరు, సెప్టెంబరు10: స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సొసైటీ మహాజనసభ సందర్భంగా మంగళవారం రైతులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్ప మాట్లాడుతూ జిల్లాలోని సొసైటీలన్నింటికీ పడుగుపాడు సొసైటీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌సీవో యలమందారావు, సహకారశాఖ అధికారులు సుభాషిణి, కట్టా సుబ్రహ్మణ్యం, రైతునాయకులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి సొసైటీ సీఈవో కొండూరు గోవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 68 మంది రైతులు రక్తదానం చేశారు.


రక్తదానం చేస్తున్న సొసైటీ సీఈవో గోవర్ధనరెడ్డి

వీరవనిత ఐలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం. సెప్టెంబరు10: తెలీగా భూపోరాటానికి పునాది వేసిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని రజకసంఘం మండల అధ్యక్షుడు చిత్తలూరు రామయ్య అన్నారు. బుచ్చి పట్టణంలోని ఏపీ రజక సంఘం కార్యాలయంలో మంగళవారం ఐలమ్మ 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారిణిగా, భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం జ్వలించిన నిప్పుకణిక ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకపాటి మాల్యాద్రి, పెంచల ప్రసాద్, వెంకటేశ్వర్లు, మస్తానయ్య, అంకయ్య, ప్రదీప్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

చెరువు అక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతసాగరం : బొమ్మవరం చెరువులో ఐదెకరాల భూమిని అక్రమించి పామాయిల్ సాగు చేసిన వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో మంగళవారం అధికారులు స్పందించారు. అనంతసాగరం డిప్యూటీ తహసీల్దారు గిరీష్, ఆర్‌ఐ రమేష్, ఇరిగేషన్ ఏఈ ఖాదర్‌లు ఆక్రమించిన చెరువును పరిశీలించి బాధ్యులకు నోటీసులు అందజేశారు. ప్రభుత్వ భూమిలో దిగరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



చంద్రబాబును విమర్శించే స్థాయి కాకాణికి లేదు : టీడీపీ

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 10: రాష్ట్రంలో కాకాణిని విలువ లేదని, సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి ఆయనకు లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. మండలంలోని నరుకూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు దక్కని పునరావాసం, చంద్రబాబుకు దక్కుతుందని కాకాణి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని తెలిపారు. వరద ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలి తప్ప రాజకీయాలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. జిల్లా వైసీపీ నాయకులు వరద బాధితులకు ఏం సహాయం చేశారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సోమిరెడ్డిపై దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఎంపీటీసీ రఘుబాబు, మాగుంట రమణారెడ్డి, మన్యం జితేంద్రగౌడ్, ఎం. పోతన, టీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● కాకాణిని మించిన అవినీతిపరుడు లేడు

పొదలకూరు : సర్వేపల్లిలో మాజీ మంత్రి కాకాణిని మించిన అవినీతిపరుడు మరొకరులేడని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలోనే ఇసుక కొరత సృష్టించారని, ఇప్పుడు ఆ బురద టీడీపీకి పూయాలని చూస్తున్నారని అన్నారు. కాకాణి నిద్రలేచింది మొదలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు దుయ్యబట్టారు. ఇసుక, మైనింగ్, క్వార్ట్జ్, అసైన్డ్‌భూముల దోపిడీకి ఆద్యుడు మాజీ మంత్రి కాకాణేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, ఆదాల సుగుణమ్మ, వీ అరుణ, భాస్కర్‌రెడ్డి, కే సందీప్ తదితరులు పాల్గొన్నారు.




టీపీ గూడూరు, పొదలకూరులో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శిథిలావస్థలో పశువైద్యశాల : ఆందోళనలో పాడి రైతులు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 10 : మండలంలోని కోడూరులో ఉన్న పశు వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో భద్రత పూర్తిగా లోపించిందని, వర్షాకాలం వస్తే లోపల భాగం మొత్తం ఉరవడంతో మందులు పూర్తిగా తడిసిపోతున్నాయని పశు వైద్యులు తెలిపారు. ఈ వైద్యశాల ద్వారా కోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న 13 గ్రామాల నుంచి పాడి రైతులు తమ పశువులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకువస్తుంటారు. ఈ గ్రామాలలో గ్రామీణ వైద్యశాలలు ఉన్నప్పటికీ కోడూరు వైద్యశాలలో అనుభవజ్ఞులైన పశువైద్యులు ఉండడంతో ఎక్కువ మంది పాడి రైతులు ఈ వైద్యశాల కు వస్తుంటారు. ఈ శిథిల భవనం గురించి గతం లో వైసీపీ ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకపోయిందని, కూటమి ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక పాడి రైతులు కోరుతున్నారు.

ఉత్సాహంగా వినాయక నిమజ్జనాలు

కావలి రూరల్, సెప్టెంబరు 10: కావలి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో స్వామివారిని ఊరేగిస్తూ తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం తీరప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పనిచేయని ఫౌంటెన్లు

సింహపురిని సుందర నగరంగా మార్చే క్రమంలో గతంలో పలు ప్రధాన కూడళ్లలో వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేశారు. నగరానికి అందాన్ని, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షల రూపాయలు వెచ్చించి వీటిని నిర్మించారు. అయితే నగర పాలక సంస్థ పట్టించుకోకపోవడం, పాలకుల ఉదాసీనతతో ఆ ఫౌంటెన్లు నీళ్లులేక నిరుపయోగంగా, చెత్త కుండీలుగా మారిపోయాయి. రాష్ట్ర మున్సిపల్ మంత్రి సొంత ఊళ్లోనే పరిస్థితి ఇలా ఉండటం గమనార్హం.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఏసీ సెంటర్‌లో చెత్త కుండీలా మారిన ఫౌంటెన్


నర్తకి సెంటర్ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద...


పూలే బొమ్మ ముందు పనిచేయని ఫౌంటెన్


గాంధీబొమ్మ సెంటర్‌లో...


వీఆర్సీ కూడలిలో...

నేడు గణేశ్ నిమజ్జనం

- సామూహికంగా జలధిలోకి గణనాథులు
- శోభాయాత్ర, వివిధ ఆలయాల ప్రసాదాల పంపిణీ
- నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 10 : నెల్లూరు నగరంలో వైభవంగా జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో ఐదో రోజు బుధవారం భారీ ఎత్తున సామూహికంగా గణనాథుల నిమజ్జనోత్సవం జరగనుంది. పెద్ద సంఖ్యలో ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ప్రధానంగా స్వర్ణాల చెరువు లోని గణేష్ ఘాట్, పెన్నా ఘాట్, జాఫర్ సాహెబ్ కాలువ ఘాట్ వద్ద నిమజ్జనోత్సవం జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తుండగా, నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం కూడా పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది.



ఏర్పాట్ల పరిశీలన

సామూహిక నిమజ్జనం వేడుకల ఏర్పాట్లను మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ సేవా సమితి నాయకులు పర్యవేక్షించారు. భక్తులకు, గణేష్ మండప నిర్వాహకులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించినట్లు వారు తెలిపారు. సామూహిక నిమజ్జనం సందర్భంగా మహిళల కోలాటాలతో శోభాయాత్ర, గంగా హారతులు నిర్వహిస్తారని, గణేష్ ఘాట్ వద్ద పెంచలకోన, నరసింహకొండ, బిట్రగుంట, నర్రవాడ, గంగపట్నం, ఇరుకళలపరమేశ్వరి, కృష్ణపట్నం శివాలయం, రాజరాజేశ్వరి ఆలయాల ప్రసాదాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పెన్నాఘాట్‌లో రంగనాథస్వామి, మూలస్థానేశ్వరస్వామి, ధర్మరాజుల స్వామి ఆలయాల నుంచి ఉచిత ప్రసాదాలు భక్తులకు అందిస్తారని జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాహనాల మళ్లింపు

నెల్లూరు(క్రైం): గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం మీదుగా జొన్నవాడ వైపు వెళ్లే మార్గంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 12వ తేదీ ఉదయం వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు, పొదలకూరు రోడ్డు, పాతమున్సిపల్ కార్యాలయం నుంచి జొన్నవాడ వైపు వెళ్లే వాహనాలు, బుచ్చి నుంచి జొన్నవాడ మీదుగా నెల్లూరు వచ్చే వాహనాల రాకపోకలు నిషేధించామని తెలిపారు. ప్రజలు కోవూరు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. కేవలం గణేష్ నిమజ్జన వాహనాలను మాత్రమే ఘాట్‌వద్దకు అనుమతిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.



గణేశ్ ఘాట్‌లో నిమజ్జన ఏర్పాట్లపై చర్చిస్తున్న గిరిధర్‌రెడ్డి, నాయకులు


ఉట్టి కొడితే రూ.లక్ష

● విజేత విఘ్నేశ్వరుడే !

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 10 : గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నగరంలో ఉట్టి ఉత్సవంలో కొత్త పంథాను ప్రారంభించారు. మాగుంట లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన లంబోదర గణేష్ మండపం వద్ద మంగళవారం ఉట్టి మహోత్సవాన్ని యువతలో ఉత్సాహాన్నింపేలా నిర్వహించారు. ఉట్టి కొట్టిన వారికి ఒక లక్షా పదహారు వేల రూపాయలను బహుమతిగా ప్రకటించారు. దీంతో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పెద్ద సంఖ్యలో యువత పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రత్యేకంగా తయారు చేసిన ఉట్టిని తప్పెట్లు, మంగళవాయిద్యాలు, బ్యాండు కచేరీ, డీజే సౌండ్స్, యువకుల నృత్యాల మధ్య జోడు గుర్రాలతో ఊరేగించారు. అయితే ఈ వేడుకలో ఉట్టిని ఎవరూ కొట్టలేకపోవడంతో విఘ్నేశ్వరుడినే విజేతగా ప్రకటించి రూ.1.16లక్షల మొత్తాన్ని వరద బాధితుల సహాయనిధి కోసం బుధవారం కలెక్టర్‌కు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కాగా, లంబోదర గణపతిని రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజితమ్మ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. కార్యక్రమంలో మదన్‌కుమార్‌రెడ్డి, దాట్ల చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లంబోదర సెంటర్‌లో జరిగిన ఉట్టి మహోత్సవంలో సందడి చేస్తున్న యువకులు


బాలాజీనగర్‌లోని బాలగణపతి


రాణాప్రతాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బంగారు గణపతి

● పూతరేకుల గణపతికి ఉద్వాసన

సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఆత్రేయపురం పూతరేకులతో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహానికి సోమవారం రాత్రి ఉద్వాసన చెప్పారు. విగ్రహం తయారీకి ఉపయోగించిన పూత రేకులను భక్తులకు పంపిణీ చేశారు.

● రామలింగాపురం బ్రిడ్జి సమీపంలోని శారదా క్రియేషన్స్‌లో 104 కేజీల పసుపు, విభూది, కుంకుమ, గంధంతో ఏర్పాటు చేసిన 8 అడుగుల ఏకో గణపతికి సోమవారం రాత్రి ఉద్వాసన చెప్పారు. విగ్రహ తయారీకి వినియోగించిన పసుపు, కుంకుమ, విభూది, గంధాన్ని మంగళవారం భక్తులకు పంపిణీ చేశారు.

● బాలాజీనగర్‌లో మట్టి, కాలుష్య రహిత రంగులతో రూపొందించిన 14 అడుగుల బాలగణపతి విగ్రహానికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. మండపం వద్ద అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● చిన్నబజారు రాణాప్రతాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బంగారు గణపతి భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

● పురమందిరం ప్రాంగణంలోని జ్యోతి వినాయక మందిరం బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామికి శేష వాహనంపై నగరోత్సవం జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, వెన్నతో మూలవర్లకు అలంకారం జరిగాయి.

● పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరాలయంలో మంగళవారం రాత్రి ఉట్టి మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం జరిగాయి.

సచివాలయాలను గాడిలో పెట్టేలా!

- ఆకస్మిక తనిఖీలకు ప్రత్యేక బృందాలు
- రెండు సచివాలయాలకు ఓ అధికారి నియామకం

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 10 : నగరంలోని డివిజన్ సచివాలయాల పని తీరును మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పాలన పరంగా పక్కదారి పట్టడాన్ని కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ సీరియస్‌గా తీసుకున్నారు. సచివాలయ కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తితో ఉన్న ఆయన, వారి పనివిధానంలో మార్పు తెచ్చేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నారు. రెండు సచివాలయాలకు ఒకరి చొప్పున ప్రత్యేక అధికారుల బృందాన్ని సిద్ధం చేస్తున్నారు. వీరి ద్వారా వరుస తనిఖీలు నిర్వహించి సచివాలయ వ్యవస్థకు పట్టిన నిర్లక్ష్యపు తప్పును వదిలించేందుకు సమాయత్తమవుతున్నారు. సచివాలయంలో ఉండే మూమెంట్ బుక్ ఆధారంగా కార్యదర్శులపై చర్యలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కమిషనర్ సూర్యతేజ ఆగస్టు20వతేదీ మధ్యాహ్నం 9వ డివిజన్ 2వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు వెళ్లారు. అక్కడ సచివాలయానికి తాళం వేసి ఉండటంతో విస్మయం చెందారు. ఇలాగైతే ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతాయంటూ అధికారులు, సిబ్బందిని మందలించారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలోని 166 సచివాలయాలపై ఆరా తీశారు. ప్రస్తుతం సచివాలయాల పనితీరును పర్యవేక్షిస్తున్న అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గుర్తించారు. ఆకస్మిక తనిఖీలు చేయకపోతే సచివాలయ వ్యవస్థ పూర్తిగా పాడైపోతుందని గ్రహించి ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశించారు.

వేనాడు దర్గాలో గంధోత్సవ సందడి



పోలేరమ్మ జాతరకు నేడు చాటింపు

వెంకటగిరి పోలేరమ్మ జాతరకు బుధవారం చాటింపు వేయనున్నారు. ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించే జాతరకు ఆనవాయితీ ప్రకారం పనిబాట్ల వారికి జాతర నిర్వహణకు అనుమతులు ఇస్తూ వెంకటగిరి రాజాలు నగిరి తాంబూలం అందించనున్నారు. అలాగే పోలేరమ్మ రాకను తెలియజేస్తూ బుధవారం అర్ధరాత్రి కాంపాళెం వద్ద ఉన్న కామాక్షమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఎట్టివారు వెంకటగిరి పాత పంచాయతీ హద్దుల్లో దండోరా వేయనున్నారు. 'ఈ బుధవారం కాకుండా ఆపై బుధవారం అమ్మవారు కొలువు దీరనున్నారహో' అంటూ డప్పు కొట్టి చాటింపు వేస్తారు. తొలి చాటింపు వేసిన నాటినుంచి ఊర్లో ఎటువంటి శుభకార్యాలు నిర్వహించకపోవడం ఇక్కడ ఆనవాయితీ. అదేవిధంగా తొలిచాటు సందర్భంగా వెంకటగిరి పాత పంచాయతీలో నిద్ర చేసిన వారు తప్పనిసరిగా జాతరలో అమ్మవారి విరూపోత్సవం వరకు ఉండి పోవాలన్నది మరో ఆనవాయితీ.బయట ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లే వారు చాటింపు వేయకముందే వెళ్లిపోవడం, అదే రోజు రాత్రి బయట నిద్రచేయకుండా ఇంటికి చేరుకోవడం ఇంకో ఆనవాయితీ.పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు ఇచ్చారు.

\- వెంకటగిరి



తడ, సెప్టెంబరు 10: తడ మండలంలోని వేనాడులో వున్న షేక్ దావూద్ షా వలీ అల్లా తాత దర్గా 29వ గంధోత్సవం మంగళవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. 144 అడుగు పొడవున్న బాబా సమాధిని ప్రత్యేక విద్యుత్ లైట్లు, కడప నుంచి తెప్పించిన పుష్పాలతో అలంకరించారు.దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీపాలంకరణ కాంతులతో వెలిగిపోతోంది. ఉదయం నుంచే దర్గాకు మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.ఉర్దూ ఖవ్వాలి, పకీర్ల డప్పుల విన్యాసాలు సందడి చేశాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన గంధ మహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున ముగిశాయి. మంగళవారం రాత్రి గ్రామంలోని పీర్ల చావడి వద్ద మతపెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు, పూజలు జరిగాయి.గంధాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.తెల్లవారుజామున దర్గాకు చేరుకుని సమాధి చుట్టూ గంధం బిందెతో ప్రదక్షిణ చేశాక తల భాగాన గంధం లేపనం చేశారు.



దర్గాలో పూజలు ప్రారంభించేందుకు చద్దరు తీసుకెళ్తున్న హిందువులు

మూషిక వాహనంపై వినాయకుడు



కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహోత్సవాలలో భాగంగా మంగళవారం మూషిక వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులు గా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌ను ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకించారు. అనంతరం స్వామిని పూర్తిగా చందనంతో కప్పి ఆకృతి కనపడేలా ఉలెన్ దారాలను వినియోగించారు. దీంతో స్వామి రూపం స్పష్టంగా భక్తులకు కనబడుతుంది.స్వామికి చందనాలంకారం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకొచ్చి అలంకార మండలంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు.

కాణిపాకంలో నేడు

వరసిద్ధుడికి బుధవారం ఉదయం బంగారు చిన్న శేషవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహన సేవలు నిర్వహించనున్నారు. దీనికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

\- ఐరాల(కాణిపాకం)



వరద బాధితులకు ఆర్థిక సాయం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం డీఎంహెచ్‌వో శ్రీహరి తన జీతంలో నుంచి రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నగదు చెక్కును మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి అందించారు.



తెలంగాణ పారిశ్రామికవేత్త రూ.50లక్షలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10:తెలంగాణకు చెందిన రైజ్‌పవర్ కంపెనీ అధినేత గరుడపల్లి సంజయ్‌గుప్తా, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు.వరద బాధితుల సహాయార్థం రూ.50లక్షల చెక్కును ఆయనకు అందజేశారు.



'విజయవాణి' తరపున రూ.25లక్షలు

చౌడేపల్లె, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరు జిల్లా చౌడేపల్లెలోని విజయవాణి విద్యాసంస్థల యాజమాన్యం సీఎం సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంగళవారం విజయవాడలో మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆ సంస్థ అధినేతలు నాయిని మహేశ్‌కుమార్, శశికుమార్, హర్ష అందజేశారు.

తీరంలో గల్లంతైన యువకుడి మృతి

కోట/ వాకాడు, సెప్టెంబరు 10:వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సోమవారం వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తూ గల్లంతైన ఎలక్ట్రీషియన్ మునిరాజ (23) మృతదేహం మంగళవారం లభ్యమైంది.నాయుడుపేట పట్టణం కావమ్మ గుడి సెంటర్‌కు చెందిన మునిరాజ యువకులతో కలసి వినాయక నిమజ్జనానికి తూపిలిపాళెం సముద్రతీరానికి సోమవారం వచ్చాడు. నిమజ్జనం చేస్తుండగా అలల తాకిడికి మునిరాజతో పాటూ అతని మిత్రులు ఫయాజ్, శ్రీనివాసులు కొట్టుకుపోయారు. వారిలో శ్రీనివాసులును మెరైన్ పోలీసులు రక్షించగా, ఫయాజ్ ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఈక్రమంలో గల్లంతైన మునిరాజ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం కోట మండలం శ్రీనివాససత్రం సమీపంలోని సముద్రంలో తేలాడుతుండగా గుర్తించిన మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు.తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవాని, పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్, వాకాడు ఎస్‌ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గల్లంతైన మునిరాజ మృతదేహం

వీఆర్‌కు తిరుమల టూ టౌన్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: తిరుమల టూ టౌన్ సీఐగా మూడు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్‌ను మళ్లీ వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్శిటీ సీఐగా మురళీమోహన్ పనిచేశారు. తెలుగుయువత శ్రేణులు గత ఏడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దహనం చేశాయి.ఈ ఘటనపై యూనివర్శిటీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.తెలుగుయువత నేతలు ఈ విషయాన్ని తాజాగా అమరావతి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వైసీపీకి సీఐ మురళీమోహన్ గతంలో ఏ విధంగా సహాయ సహకారాలందించారో వివరించారు.ఈ నేపథ్యంలో మురళీమోహన్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులొచ్చినట్లు సమాచారం.తిరుమల క్రైం సీఐగా పనిచేస్తున్న శేషగిరిని టూటౌన్‌కు ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం

అక్టోబర్‌నుంచి 12 సెబ్ సర్కిళ్లు ఎక్సైజ్ పరిధిలోకి

ఉమ్మడి జిల్లాకు డీసీ నియామకం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) కనుమరుగు కానుంది.ఎక్సైజ్ శాఖ లో సెబ్‌ను విలీనం చేస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీంతో అక్టోబరు నుంచి జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు ఎక్సైజ్ స్టేషన్లుగా రూపాంతరం చెందనున్నాయి. తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వాకాడు, వెంకటగిరి సెబ్ స్టేషన్లను అక్టోబరు నుంచి ఎక్సైజ్ స్టేషన్లుగా మార్చి స్టేషన్‌కో సీఐ స్థాయి అధికారిని నియమించనున్నారు. వీరి పరిధిలో స్టేషన్ స్థాయిని బట్టి ఇద్దరు ఎస్‌ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు కాకుండా హోంగార్డులను కొంతమందిని నియమించే అవకాశాలున్నాయి. త్వరలో ప్రవేశ పెట్టనున్న ప్రైవేటు మద్యం షాపులు, బార్లు వీరి పరిధిలోకి రానున్నాయి.దీనికోసం ప్రతి రెండు జిల్లాలకు కలిపి ఒక డిప్యూటీ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించనుంది. దీంతో ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం రానుంది.

అమెరికన్ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రొఫెసర్ల బృందం

● 20 రోజుల పాటు అధ్యయనం చేసే అవకాశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం పర్యటిస్తోంది. ఈ నెల 7వ తేదీ తిరుపతి నుంచి బయలుదేరిన ఈ బృందం అమెరికాకు చేరుకుంది. ఈక్రమంలో అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీతో గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ పర్యటన కొనసాగుతూ ఉంది. ఈ పర్యటనకు రుసా నిధులు వెచ్చించనుంది. 20 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా పార్డ్యూ యూనివర్సిటీలో అమలవుతున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పురోగతిని అధ్యయనం చేయనుంది. తద్వారా ఆ వర్సిటీతో ఎంటర్‌ప్రైనర్‌షిప్ కొలాబరేషన్‌కు ప్రయత్నం సాగుతుంది. ఈ బృందంలో రుసా సీఈవో రాయల వంశీకృష్ణ, రుసా కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ టి. రమాశ్రీ (ఈసీఈ విభాగం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ వి. ఉషారెడ్డి (ఈఈఈ విభాగం, ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ ఎం.హేమ (వైరాలజీ విభాగం), ప్రొఫెసర్ కె.సుమకిరణ్ (ఇంగ్లీషు విభాగం), ప్రొఫెసర్ కె.వి.సుచరిత (హోం సైన్స్ విభాగం) ఉన్నారు. ఈ పర్యటన పూర్తయ్యాక అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా ఎస్వీయూనివర్సిటీని సందర్శించి, కొలాబరేషన్‌పై అధికారిక నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రస్తుత పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.



పార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం


పాకాల సబ్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారిణిగా పూర్ణిమ

కందుకూరు, సెప్టెంబరు 10 : నెల్లూరు జిల్లా కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పెళ్లకూరు పూర్ణిమను చిత్తూరు జిల్లా పాకాలకు బదిలీ చేస్తూ హైకోర్టు పరిపాలనా విభాగ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంగళగిరిలోని జ్యుడిషియల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న పూర్ణిమ ఒంగోలు జిల్లా కోర్టులో జరిగే ప్రయోగాత్మక శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత పాకాలలో బాధ్యతలు స్వీకరించాలని పేర్కొన్నారు.

మహిళా యూనివర్సిటీలో పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10:మహిళా యూనివర్సిటీలో పీజీ ప్రవేశ గడువును ఈ నెల12వ తేదీ దాకా పొడిగించారు.ఏపీపీజీసెట్ ర్యాంకు పొంది, పద్మావతి వర్సిటీలో సీట్ కేటాయింపు పొందిన వారు ఈ నెల 12వ తేదీ లోపు ప్రవేశం పొందవచ్చని పీఆర్వో శ్రీరజని తెలిపారు.ఈ నెల 10వ తేదీ వరకు తొలుత గడువు విధించామని, విద్యార్థుల సౌకర్యార్థం 12వ తేదీ దాకా పొడిగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

నగరి, సెప్టెంబరు10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని నత్తంకండ్రిగకు చెందిన కానిస్టేబుల్ వినోద్‌కుమార్ (32) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన నింద్ర పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరి వస్తుండగా మార్గమధ్యలో ఫ్రైడ్‌ఇన్ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఓవర్‌టేక్ చేయబోయారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో లారీ ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన భార్య కళావతి ముడిపల్లి సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వినోద్‌కుమార్ మృతితో నెత్తంకండ్రిగలో విషాదఛాయలు అలముకున్నాయి.

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓకేషనల్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా మంగళవారం పేర్కొన్నారు. ఓకేషనల్ విభాగంలోని వివిధ కోర్సులకు విద్యాబోధన అందించేందుకు బీటెక్ సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారు ఈనెల 19వ తేదీలోగా వివరాలను అందజేయాలన్నారు. వివరాలకు స్థానిక కళాశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: పార్టీలకతీతంగా అందరూ కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎ.అనిల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యవసాయ సీజన్ కావడంతో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువుల మరమ్మతులపై దృష్టి సారించాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని కూటమి ప్రభుత్వం గ్రామాల రూపురేఖలను మార్చేందుకు నిధులు కేటాయించిందన్నారు. అధికారులు ఏవైనా సమస్యలుంటే తమకు నివేదిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే విజయశ్రీని ఎంపీపీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏవో కవిత, సీడీపీవో శారదాంబ, ఎంఈవో శ్రీనివాసుల, ఏపీఎం హేమమాలిని, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తొణుకుమాల పొలాల్లో మృతదేహం కలకలం!

చిల్లకూరు, సెప్టెంబరు 10: మండలంలోని తొణుకుమాల సమీపంలోని పొలాల్లో మృతదేహం ఉన్నట్లు మంగళవారం కలకలం రేగింది. ఓ వ్యక్తిని కొట్టి చంపి పొలాల్లో పూడ్చివేశారని గ్రామస్తులు చెబుతున్నారు. తొణుకుమాలలోని మామిడితోటలో కాపలాగా ఉంటున్న అంకయ్య మూడురోజుల క్రితం అతని స్నేహితుడికి తోడుగా తోటలోకి కాపలాకు తీసుకువచ్చాడన్నారు. ఇద్దరు కలిసి సమీప పొలాల్లోని విద్యుత్ స్టార్టర్లను అపహరించి అందులోని రాగి తీగలను విక్రయించేవారన్నారు. అయితే సోమవారం రాత్రి తోటలో వారిద్దరి మధ్య స్వల్ప వివాదం తలెత్తడంతో అంకయ్య అతని స్నేహితుడిపై దాడి చేయడంతో అతనను మృతిచెందడంతో మృతదేహాన్ని తోట సమీపంలోని పొలంలో పూడ్చివేసినట్లు భావిస్తున్నారు. అయితే అంకయ్య పరారీలో ఉండడంతో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై తోట యజమాని అరుణమ్మ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తహసీల్దారు, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గుంటను తవ్వలేదని పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



సూచనలిస్తున్న అదనపు జిల్లా జడ్జి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీమార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చునన్నారు. రాజీ అయ్యే కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనారాణి, రాజేష్, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేనాడు గంధోత్సవానికి పది ఆర్టీసీ బస్సులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: వేనాడు దర్గా గంధోత్సవానికి వెళ్లే భక్తుల కోసం 10 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. ఈ బస్సులు సూళ్లూరుపేట షార్ వై జంక్షన్, రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతాయన్నారు. బుధవారం సాయంత్రం వరకు ఈ బస్సులు తిరుగుతుంటాయన్నారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అదనపు సర్వీసులు నడుపుతామన్నారు. కాగా గంధోత్సవం సందర్భంగా అధ్వానంగా ఉన్న వేనాడు రోడ్డుకు ఉత్సవ నిర్వాహకులు మట్టిని తోలి మరమ్మతులు చేపట్టారు. అట్టకానితిప్ప నుంచి వేనాడు దర్గా వరకు 10 కి.మీ మేర రోడ్డు గుంతలు పూడ్చారు.

నిమజ్జన వ్యర్థాల తరలింపు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాకాడు, సెప్టెంబరు 10: మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో ప్రతిమల ముక్కలు విరిగిపడి సముద్రం ఒడ్డునే చేరడంతో భక్తులు ఇబ్బందులపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'నిమజ్జనానికి వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం' కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం నుంచి పారిశుధ్య పనులను చేపట్టి ఒడ్డున ఉన్న విరిగిపడి ఉన్న ముక్కలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు చేపడుతున్నామని డీఎల్‌పీవో వెంకటరమణ తెలిపారు. ఎంపీడీవో మనోహర్‌గౌడ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నరకయాతన?

- రైల్వేగేటు పడితే వాహన చోదకులకు చుక్కలే
- అండర్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంతో తప్పని అవస్థలు







గేటు పడడంతో నిరీక్షిస్తున్న వాహన చోదకులు - గేటు తియ్యడంతో వాహన చోదకుల రద్దీ - రోడ్డుకు అడ్డంగా ఉన్న అండర్ బ్రిడ్జి దిమ్మె

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: దశాబ్ద కాలం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రం నడిబొడ్డున ఉన్న రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం వాహన చోదకులకు, ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోంది. రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రతి ఐదు నిమిషాలకొకసారి రైల్వే గేటు పడుతుండడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరుతున్నాయి. గేటు వేస్తే ఒక్కోసారి పది నుంచి 30 నిమిషాల వరకు తెరుచుకోవడం లేదు. దీంతో ఇరువైపులా వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. ప్రధాన వ్యాపార కూడలి ప్రాంతాలన్నీ ఈ గేటుకు రెండు వైపులా ఉండడం ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సూళ్లూరుపేట పట్టణం ఇటు పారిశ్రామికంగా, జనాభా పరంగా రోజురోజుకు విస్తరిస్తోంది. పట్టణాన్ని చీల్చుకుంటూ రైల్వే లైను వెళ్తోంది. పట్టణానికి తూర్పు వైపే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలతో పాటు, ప్రైవేటు వైద్యశాలలు, పాఠశాలలు, షార్ ఉద్యోగుల కాలనీలన్నీ ఉన్నాయి. వీరందరూ నిరంతరం చిన్నపాటి పనికోసం కూడా ఈవైపే రావాల్సి ఉంది. అదే విధంగా వ్యాపారస్తులు చెన్నైకి వెళ్లాలన్న ఈ గేటు దాటాల్సి ఉంది. రోజురోజుకు పెరుగుతున్న రైళ్ల రాకపోకలు కూడా ఒక శాపంగా వాహనచోదులకు మారింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో కంపెనీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం రైల్వేగేటు వద్ద నరకం అనుభవిస్తున్నారు. మూడేళ్ల క్రితం రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు ఆరు నెలలు పనులు జరిగాయి. భూమి నుంచి నీళ్లుఊరడం, సిల్టు కావడంతో పనులను ఆపేశారు. అప్పటి నుంచి అండర్ బ్రిడ్జికి తెచ్చిన దిమ్మెలు రోడ్డు పక్కనే రైల్వే అధికారులు వదిలేసి వెళ్లారు. ఈ దిమ్మెలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహన చోదకులు గేటు వేసి తీసిన సమయంలో ఇరుకు దారిలో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు గాని, మున్సిపాలిటీ వారు గాని కనీసం రోడ్డుకు అడ్డంగా ఉన్న దిమ్మెలను తొలిగించపోవడం ఏమిటని ప్రజలు నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గేటును పరిశీలించి వెళ్లారు. కానీ ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. పట్టణ నడిబొడ్డున ఈ రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే వాహన చోదకులకు పడిగాపుల కాయాల్సిన అవసరం ఉండదు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలేరమ్మ జాతరకు పటిష్ఠ భద్రత : ఏఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10: పోలేరమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఏస్పీ రవి మనోహరా చారి ఆదేశించారు. మంగళవారం పోలేరమ్మ పుట్టినిల్లు, మెట్టినిల్లు, అమ్మవారి ఆలయం, నిమజ్జన ప్రాంతాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తుతారని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చోరీలు, గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది జాతర పుటేజీలు వీక్షించి తదనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎస్పీ రమణ, సీఐ ఏ.వీ. రమణ, ఎస్ఐ గోపీ, ఏఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు

గూడూరు, సెప్టెంబరు 10: జాతీయస్థాయిలో జరిగే జూనియర్ పురుషుల హాకీ క్రీడా పోటీల్లో గూడూరు క్రీడాకారులు పాల్గొననున్నట్లు తిరుపతి శాప్ హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ మంగళవారం తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఈనెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరగనున్న 14వ జాతీయస్థాయి జూనియర్ పురుషుల హాకీ ఆంధ్రా జట్టుకు గూడూరుకు చెందిన క్రీడాకారులు లక్ష్మీవరప్రసాద్, భార్గవ్ ఎంపికయ్యారని కోచ్ పేర్కొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి





గూడూరు, కోట పట్టణాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమాలు

గూడూరు అర్బన్/ కోట, సెప్టెంబరు 10: గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి మహిళా ఉద్యమనేతగా ఐలమ్మ గుర్తింపు పొందారన్నారు. రజాకార్ల దురాగతాలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. నేటి యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, కాలేషా, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు. కోట పట్టణంలోని బజారుసెంటర్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యమకారి చాకలి ఐలమ్మకు రజక సంక్షేమ సంఘం తరఫున నివాళులర్పించారు. కె.జగదీష్ ఆధ్వర్యంలో తమ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు కాంస్య పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, సెప్టెంబరు 10: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి మహిధర్‌రెడ్డి ఎన్‌సీసీ నావెల్ రింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించడంతో మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు. ఆల్ ఇండియా నౌ సైనిక్ క్యాంప్‌లో నావెల్ స్పెషలైజ్డ్ సబ్జెక్టులో హెల్త్ అండ్ హైజీన్‌లో కాంస్య పతకం సాధించినట్టు ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ హరనాథ్‌రెడ్డి తెలిపారు.

అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పది

- ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 10 : అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొలిమిట్టలో నిర్వహించిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. దైవ కార్యక్రమంతో పాటు స్వామి వారి ప్రసాదంగా అన్నదానం నిర్వహించి పేదల ఆకలి తీర్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు. జి.మురళి, బి. రాజేశ్వరరావు, కేవీకే ప్రసాదనాయుడు, వెంకటముని, మంకు ఆనంద్, సుబ్బుయాదవ్, హేమంత్ చౌదిరి, నాని, చంటి, నిర్వాహకులు సాయి, దనుంజయ పురుషోత్తం, ఉమా, నాదముని, మురళి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జాతీయ రహదారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద మంగళవారం అన్నదానం జరిగింది. ముందుగా నిర్వాహకులు వినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణ, మండలంలోని పలు వినాయక ప్రతిమల వద్ద నాలుగో రోజు ఉట్టి కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట, సెప్టెంబరు 10: ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట విక్రమ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాప్తికి కారకాలు, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ అంటువ్యాధికాదని వ్యాధిగ్రస్తుల పట్ల కరుణతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ కళాశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్ర, నవజీవన్ సిబ్బంది ఉన్నారు.

బలిజల అభివృద్ధికి కృషి



వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 10: బలిజ సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని శ్రీ కృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు టీటీ మణి అన్నారు. మంగళవారం కోమల 70ఎంఎంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంఘ సభ్యుల పెళ్లిళ్లకు తాళి బొట్టు ఉచితంగా అదిస్తామన్నారు. విద్య, వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.మణి, ప్రధాన కార్యదర్శిగా జి.మనోజ్, గౌరవాధ్యక్షుడిగా గోపాల్, కోశాధికారిగా బి.వసంత్ సమా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పోలేరమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 10: వెంకటగిరి పోలేరమ్మ జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. జాతరకు బుధవారం చాటింపు వేయనున్న నేపథ్యంలో మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.జాతరలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. క్యూలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుబాటులో ఉండేలా అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. తాగునీరు, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు జనరేటర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఫైర్ సేఫ్టీ, బారికేడ్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ అనౌన్స్‌మెంట్, రవాణా సౌకర్యాలు, సహాయ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో కిషోర్, ఏఎస్పీలు రాజేంద్ర, రవి మనోహరాచారి, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి, పోలేమ్మ ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న చవితి వేడుకలు



నాయుడుపేట, సెప్టెంబరు 10 : వినాయక చవితి పండగ పర్వదినాలలో భాగంగా 4వ రోజు మంగళవారం చవితి వేడుకలు వైభవంగా కొనసాగాయి. స్థానిక అమరాగార్డెన్‌లో కేదార్‌నాథ్ గణనాథుని సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, సుధీర్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు, పల్లకీసేవలో పాల్గొన్నారు. స్థానిక దర్గావీధిలో పొట్లపూడి రాజేష్, మిత్రులు ఏర్పాటు చేసిన వినాయక చవితికి భారీ సెట్టింగ్, భారీ వినాయక ప్రతిమను స్థానిక విజన్ పాఠశాల విద్యార్థులు దర్శించుకున్నారు. పలు వినాయక చవితి ప్రతిమల వద్ద అన్నప్రసాదాలు అందించారు.

నాలుగో రోజు చవితి సంబరాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: చవితి సంబరాలు సూళ్లూరుపేటలో ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం గణనాథుడి ప్రతిమల వద్ద విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం బాపూజీ వీధి, షార్ బస్టాండు, ఇందిరానగర్ వద్ద ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనం



వాకాడు, సెప్టెంబరు 10 : తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి మంగళవారం తూపిలి పాళెం సముద్ర తీరంలో గణేశ్ ప్రతిమలు నిమజ్జనానికి తరలివచ్చాయి. 4వ రోజు కావడంతో యువత, చిన్నారులు, మహిళలు ట్రాక్టర్లు, మినీలారీలు, తదితర వాహనాల్లో సముద్ర తీరానికి చేరుకున్నారు. రంగులు చల్లుకుంటూ నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్లను ఎస్ఐలు నాగబాబు, పవన్‌కుమార్‌లు ప్రశాంతంగా జరిగేలా చూశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ 4వ రోజు కావడంతో 120కి పైగా గణేష్ ప్రతిమలు నిమజ్జనానికి వచ్చాయన్నారు. బుధవారం 5వ రోజు కావడంతో అధిక సంఖ్యలో విగ్రహాలు తరలి వస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యాలకు ఏర్పాటు చేసి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక రోటరీభవన్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతినెలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, దశరథరామిరెడ్డి, కిరణ్‌చక్రవర్తి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



దుప్పట్ల పంపిణీలో ఎమ్మెల్యే దంపతులు

గూడూరు, సెప్టెంబరు 10: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే సొంతనిధుల నుంచి రూ.5 లక్షల విలువైన దుప్పట్లను ఆయన సతీమణి సంధ్యారాణితో కలసి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల కారణంగా ఇక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు అప్రమత్తంగా ఉంటూ, ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలందరూ వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలవాలని సీఎం ఆదేశాలతో బాధితులకు సరుకులు, దుప్పట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిషోర్ నాయుడు, నటశేఖర్, బి.ప్రణీత్, ఓంప్రకాష్, సునీల్, కళ్యాణ్, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి లక్ష రూపాయల విరాళం



సీఎంకు చెక్కును అందిస్తున్న ఉద్యోగులు

నాయుడుపేట, సెప్టెంబరు 10: ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష రూపాయల చెక్కును ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తరఫున సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు నాయుడుపేట ఏపీ గురుకుల పాఠశాల ఉద్యోగి, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ తెలిపారు. వరద బాధితుల చేయూత కోసం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. వెంకట్, ప్రవీణ్, జి.వంశీ, రామ్మూర్తినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగండి



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గూడూరు, సెప్టెంబరు 10: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని జీఎంయూపీ విశ్రాంత హెచ్‌ఎం మేరీ శ్యామసుందరి, హెచ్‌ఎం రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జీఎంయూపీ పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి, భోజన ప్లేట్లు, పాఠశాలకు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 37 ఏళ్ల క్రితం ఈ పాఠశా లలో చదివి ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడి రాణిస్తున్న పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు ఒక వేదికగా కలవడం ఆనందంగా ఉందన్నారు. ఇదే తరహాలో ప్రస్తుత విద్యార్థులు కూడా కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు. హెచ్‌ఎంలను సన్మానించారు.

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానీయం



సీఐటీయూ నాయకుల ధర్నా

గూడూరు, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని అడ్డుకుని తీరుతామని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం టవర్‌క్లాక్ కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోని విశాఖ ఉక్కు కర్మాగారానికి విశిష్టత ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నష్టాల్లోకి నెట్టివేసి ప్రైవేటుపరం చేయాలని కుట్రలు పన్నుతోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య, సుబ్రమణ్యం, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని కేంద్రప్రభుత్వం మానుకోవాలని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభాకర్, శశికుమార్, చంద్రయ్య, కాలేషా, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మహిళా కార్మికుల ధర్నా



రాయల్ టెక్స్‌టైల్ వద్ద మహిళా కార్మికుల ధర్నా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 10: ముందస్తు సమాచారం లేకుండా కర్మాగారాన్ని మూసివేయడం తగదని రాయల్ టెక్స్‌టైల్ కర్మాగార మహిళా కార్మికులు వాపోయారు. నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని రాయల్ టెక్స్‌టైల్ కర్మాగారం ఎదుట జరిగిన ధర్నాకు సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ... ఉన్నట్టుండి కర్మాగారాన్ని మూసివేయడంతో కార్మికులు వీధిన పడ్డారన్నారు. సమాచారం అందుకున్న కార్మిక శాఖ అధికారులు డీసీఎల్ వెంకటేశ్వర్లు, ఏసీఎల్ సురేష్ యాజమాన్యంతో మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి వారికి న్యాయం చేయాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు.

యాప్‌లలో పొందుపరచండి

కోట సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జరిగే ప్రతి విషయాన్ని కేటాయించిన ఆయా యాప్‌ల ద్వారా పొందుపరచాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో యాప్‌ల డౌన్‌లోడింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి ఆయా సూపర్ వైజర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇచ్చే ఆహారంలో ఎక్కడ తేడాలు ఉండకూడదన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ఉన్న అంగన్‌వాడీలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ, శేషమ్మ, తదితరులు ఉన్నారు.